ప్రజాశక్తి
శనివారం 7 అక్టోబర్ 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

విద్యుత్ భారాలు తగ్గించకుంటే..

మరో బషీర్‌బాగ్ పోరాటమే..

- 9 నుండి ప్రచార ఉద్యమం
- 16న కలెక్టరేట్ వద్ద నిరసన సభ
- జయప్రదం చేయాలని వామపక్ష పార్టీల పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపటాన్ని, వ్యవసాయ రంగానికి, గృహ వినియోగదారులకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకపోతే మరో బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటం తప్పదని ప్రభుత్వాన్ని వామపక్ష పార్టీల నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్ణయం మేరకు రాష్ట్రంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి విద్యుత్ సంస్కరణలను వేగంగా అమలు చేసేందుకు పూనుకుంటున్నారని ధ్వజమెత్తారు. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు కాకుండా, గహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు అదానీతో చీకటి ఒప్పందం చేసుకున్నారన్నారు. సర్దుబాటు చార్జీలు, సర్ చార్జీలు వంటి ఆరు రకాల పేర్లతో ప్రజలపై ఇప్పటికే భాగాలు మోపారన్నారు. ప్రభుత్వాలు తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో వ్యవసాయ రంగం అటకెక్కే పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికే ఆర్థిక సంక్షోభం, అధిక ధరల భారాలు మోస్తున్న ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం మరింతగా పెరిగిందన్నారు. పెరిగిన విద్యుత్ భారాలకు నిరసనగా ఈ నెల 9 నుండి 15వ తేదీ వరకు గ్రూపు మీటింగ్స్ ద్వారా గ్రామగ్రామాన ప్రచార ఉద్యమం సాగించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 12న అన్ని మండల కేంద్రాలలో, జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాలు ▶ 2లో

ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టు

జిల్లాకు ఒక్కటి కూడా లేదా?

- శంకుస్థాపనతో ముగిసిన పేపరు పరిశ్రమ ప్రస్థానం
- జిల్లాలో పండ్లతోటలు, టమోటా, మిర్చి పరిశ్రమలకు అవకాశం
- జిల్లా నేతల నిర్లక్ష్యంతో ఒక్క యూనిట్ కూడా రాని వైనం



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో 13 పుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులకు సిఎం జగన్ భూమి పూజ, శంకుస్థాపనలు వర్చువల్‌గా క్యాంపు కార్యాలయం నుంచి చేశారు. వీటిలో ఒక్కటి కూడా జిల్లాకు రాలేదు. కారణం ఏమిటి? ఇక్కడ వనరులు లేవా? అవకాశాలు లేవా? అంటే అన్నీ ఉన్నాయి. ఉపాధి ఒక్కటే లేదు. దాన్ని కల్పించేందుకు, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు ఉద్దేశించిన ఫుడ్‌ప్రాసెసింగు ప్రాజెక్టులు రాష్ట్రంలో పలుచోట్ల పెట్టారు. ఆయా ప్రాంతాల్లో పండే పంటలను బట్టి ఏర్పాటు చేశారు. ఇందుకు ఆయా జిల్లాల నేతల ప్రయత్నాలే కారణం.

జిల్లాలో అనేక వనరులున్నా జిల్లా నేతలకు పట్టలేదు. దీంతో ఒక్కటీ రాలేదు. ఫలితంగా జిల్లాలో ఉపాధితో పాటు రైతులకు వాటి వల్ల జరిగే ప్రయోజనాలు అందకుండా పోయాయి. చాలా కాలంగా చర్చ సాగుతున్నా కార్యాచరణే కరువైంది. జిల్లాలో పండే పంటల ఆధారంగా సహజవనరుల ఆధారంగా అనేక పరిశ్రమలకు అవకాశాలున్నాయి. అనేక అధ్యయనాలు జరిగాయి. నివేదికల్లోనూ పెట్టారు. పలు వేదికలపై చర్చలు సాగాయి. అయినా ఒక్క పరిశ్రమ కూడా జిల్లాకు రాలేదు. ఉమ్మడి ప్రకాశం జిల్లాగా ఉన్నప్పుడు రామాయపట్నం వద్ద పోర్టుతో పాటు పేపరు పరిశ్రమకు శంకు స్థాపన జరిగింది. ప్రభుత్వం మారాక పోర్టు పనులు మొదలయ్యాయి. అయితే పేపరు పరిశ్రమ పెడతామన్న విదేశీ కంపెనీ మాత్రం ముందుకు రాలేదు. దీంతో సుబాబుల్, జామాయిల్ రైతుల ఆశలు నీరుగారాయి. ఇక్కడ పేపరు పరిశ్రమ వస్తే లక్షన్నర ఎకరాల్లో సాగు చేసే ఈ రెండు పంటలకు గిట్టుబాటు ధర రావడమే కాకుండా 50 వేల మందికి ఏదో రకంగా ఉపాధి దొరుకుతుందని ఆశించారు. అవన్నీ అమలు జరగలేదు. జిల్లాలో మామిడి, బత్తాయి, సపోటా పంటలు బాగా పండుతాయి. వీటిని నిల్వ చేసే యూనిట్లు లేవు. కోల్ట్‌స్టోరేజీలు లేవు. అప్పటికప్పుడే దళారులకు అమ్ముకోవాలి. ఈ పంటలకు సంబంధించిన జ్యూస్ ఫ్యాక్టరీలు, ఎగుమతి ▶ 2లో

రైతుల భూముల్లో

ఇసుక అక్రమ రవాణా

- అధికారుల పర్యవేక్షణ లోపమే కారణం
- కావూరివారిపాలెం భూములను పరిశీలించిన సిపిఎం నాయకులు



పంట భూముల వద్ద నిరసన తెలియజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-చీరాల

చీరాల మండలంలోని కావూరివారిపాలెం పంచాయతీ, రాయల్ ఆక్వా ఫ్యాక్టరీ సమీపంలోని ఎస్సీ, బీసీ సొసైటీ భూములలో కొందరు అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. సిపిఎం ఆధ్వర్యంలో గురువారం ఇసుక అక్రమ తవ్వకాలను ఆ ప్రాంత సన్నకారు రైతులు అడ్డుకున్నారు. సిపిఎం ప్రతినిధులు, స్థానిక రైతులు వస్తున్నారని తెలిసి అక్రమార్కులు జెసిబిలను దూరంగా పెట్టారు. మంత్రి అండదండలతోనే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, తక్షణమే అక్రమ మైనింగ్‌ని ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య డిమాండ్ చేశారు. అధికారులు రైతుల భూములను పరిశీలించి.. వారికి అండగా ఉండాలని, అక్రమ ఇసుక రవాణాను నిలుపుదల చేయాలని కోరారు. రాయల్ ఆక్వా పరిశ్రమ నుండి వెలవడుతున్న వ్యర్థాల వల్ల ఆ ప్రాంతంలో రైతుల భూములన్నీ ఉప్పునీరుగా మారి పంటలు పండేందుకు వీలు లేకుండా పోయిందన్నారు. ఇసుక దళారులు రైతుల పొలాల్లో సుమారు 20 అడుగులకు పైగా తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ అటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్నారు. అక్రమార్కులు తవ్వకాలు జరిపిన గుంటల వల్ల చేలో నీరు ఇంకిపోతోందని రైతులు వాపోయారు. ఫలితంగా పొలాలను నీరు లేకుండా ఎండిపోతున్నాయన్నారు. పొడి పొలంలోనే నాట్లు వేస్తున్నామని తెలిపారు. ఆ ప్రాంతంలో లోతు గుంటలలో పడి తమ గేదెలు చనిపోయాయని ▶ 2లో



కావూరివారిపాలెంలో ఇసుక క్వారీలుగా మారిన రైతుల భూములు

సముద్రంలో సోనా బోట్ల చక్కర్లు

- ఆపలేకపోతున్న అధికారులు
- ఆందోళనలో మత్స్యకారులు

5లో



ఉమ్మడి ప్రకాశం టిడిపి నేతలతో భేటీ అయిన నారా లోకేష్

లోకేష్‌తో ఉమ్మడి ప్రకాశం నేతల భేటీ

భవిష్యత్తు కార్యాచరణపై చర్చ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌తో ఉమ్మడి ప్రకాశం జిల్లా టిడిపి నేతలు శుక్రవారం భేటీ అయ్యారు. ఢిల్లీ నుంచి నారా లోకేష్ శుక్రవారం రాజమహేంద్రవరం వచ్చారు. టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు తదుపరి పరిణామాలపై నారా లోకేష్‌తో ఉమ్మడి ప్రకాశం జిల్లా టిడిపి నేతలు చర్చించారు. భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యాచరణపై లోకేష్ జిల్లా నేతలతో చర్చించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధనరావు, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవి కుమార్, కొండపి ఎమ్మెల్యే డాక్టర్ స్వామి, జిల్లా టిడిపి అధ్యక్షులు నూకసాని బాలాజీ, టిడిపి గిద్దలూరు ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, సంతనూతలపాడు ఇన్‌చార్జి బిఎన్ విజయ్‌కుమార్, కందుకూరు ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, ఒంగోలు డెయిరీ మాజీ ఛైర్మన్ చల్లా శ్రీనివాసరావు, ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలు పాల్గొన్నారు.

మరో బషీర్‌బాగ్ పోరాటమే..

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టి ప్రజాబ్యాలెట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరసన కార్యక్రమాల ముగింపును పురస్కరించుకొని ఈనెల 16న ఒంగోలు కలెక్టరేట్ వద్ద నిరసన సభ జరుగుతుందన్నారు. కార్యక్రమాలలో రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు విరివిగా పాల్గొని తమ మద్దతును తెలపాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి మాట్లాడుతూ 1995 టిడిపి ప్రభుత్వ కాలంలో రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణలు ప్రారంభమయ్యాయని, 2000 సంవత్సరంలో బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటం వరకు సాగిందన్నారు. అప్పటి నుండి విద్యుత్తు భారాలు మోపి విషయంలో ఏ ప్రభుత్వం సాహసించలేదన్నారు. ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం విద్యుత్ సంస్కరణను వేగంగా అమలు చేసేందుకు అడుగులు వేస్తోందన్నారు. ప్రభుత్వ రంగంలోని విద్యుత్తు ఉత్పత్తిని తగ్గించి, ప్రైవేటు రంగానికి అప్పగించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. విద్యుత్ రంగాన్ని అదానీ తన చేతిలోకి తీసుకున్నారని, దీంతో నేడు విద్యుత్ సామాన్యులకు ఖరీదైన వస్తువుగా మారిందన్నారు. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు, గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగించడం ద్వారా ఉచిత విద్యుత్ పథకానికి మంగళం పాడేందుకు ప్రభుత్వం రంగాన్ని సిద్ధం చేసిందన్నారు. రానున్న 2024 ఎన్నికలలో విద్యుత్ సంస్కరణలే ప్రధాన ఎజెండాగా ఎన్నికలు జరిగేలా పోరాటం సాగాలన్నారు. సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదం పొందని విద్యుత్ సంస్కరణలను ప్రజలపై భారాల రూపంలో మోపి, కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. విద్యుత్ రంగం అదానీ కనుసన్నలలో నడుస్తోందని, 30 సంవత్సరాల పాటు విద్యుత్ స్మార్ట్ మీటర్లను తయారు చేసుకునేందుకు అదానీతో ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. విద్యుత్ భారాలు తగ్గించే వరకు ఉద్యమం ఆగదన్నారు. సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఆర్ మోహన్ మాట్లాడుతూ దేశంలోకి బొగ్గును 10 శాతం దిగుమతి అయ్యేలా అదానీ కోరిక మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అదానీకి చెందిన ఆస్ట్రేలియా బొగ్గును అధిక ధరలకు దేశంలోకి దిగుమతి అయ్యేలా మోడీ ఆమోదించారన్నారు. అనంతపురం జిల్లాలో అదానీ సోలార్ విద్యుత్ ప్లాంట్ కోసం ప్రభుత్వం 3500 ఎకరాల భూమిని ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసిందన్నారు. వచ్చే ఎన్నికలలో ఈ ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నెల 9 నుండి 15 వరకు జరిగే విద్యుత్ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.వెంకట్రావు, సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శి పివిఆర్ చౌదరి, సిపిఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి ఎస్.లలితకుమారి పాల్గొన్నారు.

రైతుల భూముల్లో ఇసుక అక్రమ రవాణా

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. 50 లింకులున్న డొంక దారిని కూడా తవ్వి దారిని పాడు చేశారన్నారు. తక్షణమే అధికారులు చర్యలు చేపట్టాలని, లేని పక్షంలో తాము ఇక్కడి ప్రాంత రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేసేందుకు కార్యచరణ రూపొందిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి కొండయ్య, ఎన్ బాబూరావు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-చీమకుర్తి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేయతలకు బహుమతులు అందజేశారు. శుక్రవారం స్థానిక గౌతమి కళాశాలలో ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జి దేవరాజు మాట్లాడుతూ గత మూడవ తేదిన నిర్వహించిన పోటీ పరీక్షలలో 85 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. విద్యార్థులలో పోటీతత్వం, సృజనాత్మకత పెంపొందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మొదటి పొందిన గౌతమి డిగ్రీ కాలేజీకి చెందిన ఇస్తాల మౌనిక, రెండో బహుమతి పొందిన ఎస్‌కె రిహానా, మూడో బహుమతి పొందిన ఎమ్మెస్సార్ కాలేజి విద్యార్థి నాగవేణికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు వాసు, మహేష్, మండల నాయకులు రామాంజి, కాలేజి సిబ్బంది తిమోతి, శ్రీనివాస్, సురేష్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నేడు పొదిలిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-పొదిలి

శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పొదిలి పట్టణంలోని రథంరోడ్ ఏరియాలో నూతన పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఇన్‌ఛార్జీ ఏఇ అంకబాబు తెలిపారు. కావున ప్రజలు, వ్యాపారస్తులు ఈ విషయం గమనించి సహకరించాలన్నారు.

ఘనంగా చిరునవ్వుల దినోత్సవం

ప్రజాశక్తి-పొదిలి

నవ్వు ఒక దివ్య ఔషధమని పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు అన్నారు. శుక్రవారం అక్టోబర్ 6న వరల్డ్ స్మైల్ డే (చిరునవ్వుల దినోత్సవం) సందర్భంగా స్థానిక జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో నవ్వులు, పువ్వుల సంఘం సభ్యులు 'చిరునవ్వుల దినోత్సవం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులైన షేక్ మదార్‌వలి మాట్లాడుతూ ప్రతిరోజూ వాకింగ్‌కు వచ్చి మిత్రులందరూ జోకులు చెప్పుకొని సంతోషంగా గడపడం, నవ్వుకోవటం వలన ఆందోళనలో ఉన్నప్పుడు ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. దీని ద్వారా రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చని, స్నేహం, సోదర భావం అలవరుచుకోవచ్చని, నవ్వినవాడు యోగి, నవ్వించువాడు భోగి, నవ్వనివాడు రోగి అని అన్నారు. పూర్వకాలంలో నవ్వు నాలుగు విధాలుగా చేటు అనేవారని, నేడు నవ్వు 40 విధాల మంచిదని, నవ్వు సర్వ మానవాళికి దివ్య ఔషధం అని, కావున అందరూ నవ్వుతూ జీవితాలను గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు గోవిందయ్య, మూసా జానీ, బాషా మొహిద్దీన్, జిలాని, ఖాదర్ బాషా, టీవీ నారాయణ, కరీముల్లా బేగ్, నాగశ్రీ పాల్గొన్నారు.



నవ్వుల దినోత్సవం నిర్వహిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు

CHANGE OF NAME

I, **VALLEPU RAGHAVULU** (OLD NAME) S/o.**VALLEPU ANKAIAH,** R/o G2, Srikrishna Towers, Mangamur Road, Near Asramam, Ongole, Prakasam District, Andhra Pradesh, Pin-523 002. have changed my name to **VALLEPU AMMA RAGHAVULU** (New Name) S/o.**VALLEPU ANKAIAH** Hence forth I will be known as **VALLEPU AMMA RAGHAVULU** Will be applicable for all purposes.

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

ప్రకాశం జిల్లా, ఒంగోలు టౌన్, ఇందుర్తినగర్ , కాపురస్థులు **దోమతోటి అనురాగ సంగీత సుందరి,** తండ్రి రామారావు లకు చెందిన గుంటూరు జిల్లా చెరుకుపల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో రిజిష్టర్ కాబడిన ఒరిజినల్ డాక్యుమెంట్ **తేది : 05-10-2023**న మా ఇంటి వద్ద నుండి కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ లో జిరాక్స్ తీసుకొని ఇంటికి వెళ్ళే దారిలో నా డాక్యుమెంట్స్ ఉన్న కవర్ పడిపోయినది. ఒరిజినల్ డాక్యుమెంట్ నెం.906/1997 దొరికిన వారు ఈ క్రింది చిరునామా గాని, ఫోన్ నెంబర్ గాని తెలియపరచగలరు.

దోమతోటి అనురాగ సంగీత సుందరి, తండ్రి రామారావు, ఇందుర్తినగర్, ఒంగోలు. సెల్ : 9000861869

కృత్రిమ గర్భధారణను సద్వినియోగం చేసుకోవాలి: డిప్యూటీ డైరెక్టర్

ప్రజాశక్తి-పొదిలి

కృత్రిమ గర్భధారణ ద్వారా మేలుజాతి పెయ్య దూడలను తయారు చేయవచ్చని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య అన్నారు. శుక్రవారం స్థానిక పశుసంవర్ధక శాఖ ఏడిఏ కార్యాలయంలో పెయ్య దూడల ఉత్పత్తి పథకం గురించి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఏ ఈఓ డాక్టర్ కాలేషా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కృత్రిమ గర్భధారణకు ఒక్కొక్కటి రూ.675/- విలువ గల లింగ నిర్ధారణ వీర్యాన్ని రెండు పర్యాయాలుగా కృత్రిమ గర్భధారణ చేసేందుకు సబ్సిడీపైన అందిస్తున్నట్లు తెలిపారు. రెండు వీర్య నాళికల ధర రూ.1350/- కాగా రైతు ధర 500/-లు, సబ్సిడీ 850/-గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు అందరూ ఉపయోగించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పొదిలి ఏడి డాక్టర్ పి.వేణు, డాక్టర్ ఎం మణిశేఖర్, మూడు మండలాల పశు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాకు ఒక్కటి కూడా లేదా.?

(మొదటిపేజీ తరువాయి)

ఆధార పరిశ్రమలు పెట్టడానికి అవకాశం ఉంది. ఆ దిశగా ఎవరూ ఆలోచన చేయలేదు. పాలకపక్ష నేతలకు పట్టనే పట్టలేదు. పశ్చిమాన టమోటాలు కూడా పశ్చిమాన బాగా పండుతాయి. ఇవి కూడా ఒకేసారి రావడంతో మార్కెట్ సౌకర్యం లేక రైతులు పారేసిన పరిస్థితి కూడా ఉంది. ఇంకా రొయ్యల సాగు ఉంది. ప్రైవేటు రంగంలో కొన్ని యూనిట్లు ఉన్నాయి. గత ప్రభుత్వం ఆక్వా ప్రాసెసింగు యూనిట్ పెట్టాలని నిర్ణయించినా అమలు జరగలేదు. జిల్లాలో మరో పంట శనగ. ఎక్కువగా పండుతుంది. దీన్ని ఆధారంగా చేసుకొని ఏదో రకమైన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కూడా పెట్టడానికి అవకాశం ఉంది. భారీగానే చేపల దిగుబడి వస్తోంది. వీటిని నిల్వ చేయడానికి కూడా సరైన సౌకర్యాలు లేవు. మిల్లెట్స్ రంగంలోనూ కొన్ని జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులు పెట్టారు. ఇక్కడ అన్ని రకాల పంటలు పండుతున్నా ఫలితం లేదు. కనీసం గిట్టుబాటు ధర కూడా లేదు. ఇక జిల్లాలో భారీ పాలపొడి ఫ్యాక్టరీని మూసే శారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే ఆసియాలోనే పెద్దదైన ప్రకాశం జిల్లా పాలపొడి ఫ్యాక్టరీ నేడు శిథిలావస్థకు చేరింది. డెయిరీని అమూల్‌కు అప్పగించారు. జిల్లా సహకార డెయిరీని సర్వనాశనం చేశారు. పాల రైతులు, ఉద్యోగులు, రవాణా రంగం మొదలు అనేక రకాలుగా పలు వర్గాలు దీని వల్ల ఉపయోగం పొందారు. దీన్ని తెరిపించి తిరిగి డెయిరిని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. ఏదేమైనా జిల్లాకు ఒక్క ఫుడ్‌ప్రాసెసింగ్ ప్రాజెక్టు కూడా దక్కకపోవడం వెనుక జిల్లా పాలకపక్ష నేతల వైఫల్యమే కారణంగా చూపక తప్పదు.

పబ్లిక్ నోటీసు

యిందు మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ **మొలకలపల్లి వెంకయ్య గారి కుమారుడు సీతారామయ్య** యిచ్చిన సంజాయిషి మేరకు పబ్లిక్ నోటీసు యివ్వడమైనది. నా క్లయింట్ స్వాదీనములో ఉన్న రిజిష్టర్ విక్రయ పత్రము డాక్యుమెంట్ నెం. **621/70,** తేది : **25.09.2023** న నా క్లయింట్ సూరారెడ్డిపాలెం గ్రామం నుండి టంగుటూరుకు ఆటోలో ప్రయాణిస్తుండగా మార్గ మధ్యములో జారిపడిపోయినది. కావున సదరు ఒరిజినల్ విక్రయ పత్రము ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

ఇట్లు

మొలకలపల్లి అజయ్ బాబు

అడ్వకేటు & రాజాపానగల్‌రోడ్, ఒంగోలు. సెల్ : 9866896439

ఒంగోలు
06.10.2023

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి: ఏఓఐ



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పొదిలి: ఈ నెల 9వ తేదీ సోమవారం భారతీయ జీవిత బీమా సంస్థ ఏజెంట్ల సమస్యలపై నిర్వహించనున్న ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో ఎల్ఐసి ఏజెంట్లు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక శాటిలైట్ కార్యాలయం వద్ద ఛలో హైదరాబాద్ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ బీమా రంగంలో జిఎస్‌టిని ఎత్తివేయాలని, డైరెక్టు మార్కెట్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బీమా సుగంను అమలు చేయవద్దని తదితర డిమాండ్ల సాధనకు జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా ఏఓఐ అఖిల భారత కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్ జోనల్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాలో అందరు ఏజెంట్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఓఐ నాయకులు వెంకటరావు, శివయ్య, రాగిపిండి రామకోటిరెడ్డి, బాషా, స్థానిక సీనియర్ ఏజెంట్లు కొండా తిరుపతి రెడ్డి, ఎం పుల్లయ్య, నల్లపు తిరుపతిరెడ్డి, పి బాలనరసయ్య, ఏజెంట్లు పాల్గొన్నారు.

St. ANN'S COLLEGE OF ENGINEERING & TECHNOLOGY
(AUTONOMOUS)
(Accredited by NBA, IE(I) & NAAC with 'A' Grade; Permanently Affiliated to JNTUK)
CHIRALA – 523 187, Bapatla District; Phone No. 08594 – 247500; www.sacet.ac.in

SPOT ADMISSIONS II YEAR B. TECH.(Lateral Entry) ON 09-10-2023

Spot Admissions will be held at the college campus from 10:00 AM. to 5:00 PM. on 09-10-2023 to fill up the following unfilled seats in "A" Category APECET-2023 counselling as well as left over Category B seats of previous academic year by conducting Spot Admissions. The candidates of OC/BC/SC/ST/EWS who have not taken admission in any college so far and qualified in APECET-2023 or qualifying Diploma or B.Sc and not secured less than 45% for OC or 40% for BC/SC/ST marks in that order of preference are eligible for spot admissions as per Spot admission guidelines.

B. Tech. – Branches	CSC	IOT	ECE	EEE	CIV	MEC
Vacancy Position 'A' Category	4	4	0	0	11	17
Vacancy Position 'B' Category in Previous Academic Year 2022-23	0	0	1	1	13	12

PRINCIPAL

For Further Details Contact: 9848051026; 9848370999; 9000021179

స్థల ఆక్రమణకు రంగం సిద్ధం

- జెసిబితో వాటర్ ట్యాంకు కూల్చివేత
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీకి చెందిన వాటర్ ట్యాంకు స్థలాన్ని ఆక్రమించేందుకు రంగం సిద్ధం చేశాడు ఓ ఘనుడు. ఏకంగా జెసిబితో వాటర్ ట్యాంకును కూల్చివేశాడు. ఆక్రమిత స్థలం ఖరీదు రూ. 50 లక్షలు ఉంటుందని అంచనా..! మార్కాపురం మున్సిపలిటీలోని 30వ వార్డులోని విజయ టాకీస్ ఏరియాలో మున్సిపాలిటీకి సంబంధించిన వాటర్ ట్యాంకును గతంలో నిర్మించారు. ప్రస్తుతం అది నిరుపయోగంగా ఉంది. ఈ స్థలంపై ఓ వ్యక్తి కన్ను పడింది. దీంతో జెసిబితో వాటర్‌ను కూల్చి వేయించాడు. ఆక్రమిత విషయం తెలుసుకున్న స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వాటర్ ట్యాంకు స్థలంలో సచివాలయం లేదా అంగన్‌వాడీ కేంద్రం నిర్మించాలని విన్నవించారు. ఆక్రమణపై మున్సిపల్ అధికారులు సరైన రీతిలో స్పందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆక్రమిత దారుడు తాము రూములు నిర్మిస్తే అద్దెలకు తీసుకోవాలని, తాను మున్సిపాలిటీకి రుసుం చెల్లిస్తాని చెప్పినట్లు స్థానికులు తెలిపారు. ఆక్రమణ విషయమై మున్సిపల్ కమిషనర్ గిరికుమార్‌ను వివరణ కోరగా తాము ఎలాంటి ఆర్డర్ ఇవ్వలేదన్నారు. ఆ స్థలం మున్సిపాలిటీదేనన్నారు. ఆక్రమణకు గురికాకుండ చూడాలని డిఇ షేక్ సుభాని, ఎఇ పి.ఆదినారాయణ ఘటనా స్థలానికి పంపినట్లు ఆయన తెలిపారు.


జెసిబితో వాటర్ ట్యాంకును కూల్చివేసుతన్నదృశ్యం

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ఎపిజిబి బ్యాంకు చైర్మన్ రాఖేష్ కశ్యప్

ప్రజాశక్తి-మార్కాపురం

రోజు రోజుకు పెరుగుతున్న పోటీ ప్రపంచంలో కార్పొరేట్ బ్యాంకులకు ధీటుగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు బ్యాంకు చైర్మన్ రాఖేష్ కశ్యప్ తెలిపారు. ఎపిజిబి మార్కాపురం రీజినల్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక టిడిడి కళ్యాణ మండపంలో బ్యాంకు ఖాతాదారులకు రూ. 668 కోట్ల విలువైన రుణాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాఖేష్ కశ్యప్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పది జిల్లాలలో 551 శాఖలతో రూ. 44 వేల కోట్ల వ్యాపారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎపిజిబి అంటే గతంలో కేవలం వ్యవసాయ రంగానికి సంబంధించిన క్రాఫ్ లోన్లు, డ్వాక్రా మహిళల రుణాలను అందించే శాఖగా పేరు ఉండేదని అన్నారు. ప్రస్తుతం ఇతర బ్యాంకులతో పాటుగా తాము కూడా వ్యవసాయ రంగానికి, ఫిషరీస్, ట్రాక్టర్లు, ఇతర వాహనాలకు, ప్రగతి టెక్స్‌టైల్స్, ప్రగతి గ్రానైట్, ప్రగతి ఆగ్రో ప్రాసెసింగ్, స్టోన్ కటింగ్ తదితర అన్ని రకాల వ్యాపారాలకు రుణాలను మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఏపీజీబీ రీజినల్ మేనేజర్ ఇ.శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ రీజినల్ పరిధిలో 50 బ్రాంచీలు ఉండగా, వాటి ద్వారా రూ 3,700 కోట్ల వ్యాపారం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ బ్రాంచి మేనేజర్లు ప్రసాద్, రామకష్ణారావు, సురేష్ కుమార్‌రెడ్డి, రీజినల్ కార్యాలయ అధికారులు వెంకన్న పాల్గొన్నారు.

హత్య కేసులో బాలుడు అరెస్టు

వివరాలు వెల్లడించిన సిఐ రామకోటయ్య

ప్రజాశక్తి-దర్శి

హత్య కేసులో ఓ బాలుడిని అరెస్టు చేసినట్లు దర్శి సిఐ రామకోటయ్య తెలిపారు. సిఐ కథనం ప్రకారం...తాళ్లూరు మండలం రామభద్రాపురం గ్రామానికి చెందిన సారెడ్డి వెంకటరెడ్డి ఆవుల ఫారంలో బీహార్‌కు చెందిన రాజన్‌పాస్వన్(21) అనే యువకుడు పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బీహార్‌కు చెందిన ఓ బాలుడు పనికోసం రాజన్‌పాస్వన్ కోసం వచ్చాడు. పాస్వన్ ఆ బాలుడిని పనిలో చేరుకొని రోజు రూ.300 వంతున ఇస్తున్నాడు. గత నెల 14వ తేది సాయంత్రం పాస్వన్, బాలుడు కలిసి రోటీలు చేసుకుని తిన్నారు. అనంతరం తనకు రూ.300 ఇవ్వాలని పాస్వన్‌ను బాలుడు కోరారు. ఈ క్రమంలో వారి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో ఆగ్రహించిన బాలుడు ఇనుప రాడ్డుతో పాస్వన్‌ను కొట్టాడు. దీంతో రాజన్‌పాస్వన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం బాలుడు మృతదేహంపై దుప్పటి కప్పి అక్కడ నుంచి మరో చోట పనిచేస్తున్న బీహార్‌కు చెందిన కైలాస్ అనే వ్యక్తి వద్ద వెళ్లాడు. కైలాస్ గంగవరం వరకూ బాలుడిని వదిలిపెట్టాడు. అనంతరం ఆ బాలుడు ఒంగోలు వెళ్లి రైల్వే స్టేషన్ సమీపంలో తిరుగుతూ కాలం గడుపుతున్నాడు. ఈ క్రమంలో పోలీసులు బాలుడిని ఒంగోలు రైల్వే స్టేషన్ సమీపంలో అరెస్టు చేశారు.



బైకు ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్


మృతురాలు అక్కమ్మ

బైకు ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని ద్రోణాదుల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎఎస్ఐ షేక్ మహమ్మద్ బాషా కథనం ప్రకారం... ద్రోణాదుల ఎస్‌సి కాలనికి చెందిన గద్దల అక్కమ్మ (52) అనే మహిళ పొలంలో పనిచేస్తున్న తన భర్త యోహాన్‌కు మధ్యాహ్న భోజనం తీసుకొని ద్రోణాదుల నుంచి నాగండ్ల వెళ్లే దారిలో నడుచుకుంటూ వెళుతుంది. అదే సమయంలో జె.పంగులూరు మండలం రాంకూరు గ్రామానికి చెందిన యతి మణికంఠ బైకుపై నాగండ్ల నుంచి ద్రోణాదులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సాయిబాబా గుడి సమీపంలో నడుచుకుంటూ వస్తున్న అక్కమ్మను బైకుతో ఢీకొన్నాడు. దీంతో ఆమె తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన సమీప పొలాల్లోని రైతులు 108 వాహన సిబ్బందికి సమాచారం అందించారు. 108 వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని అక్కమ్మను చిలకలూరిపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అక్కమ్మ పరిస్థితి విషమంగా ఉందని, గుంటూరు తీసుకెళ్లాని సూచించారు. దీంతో బంధువులు గుంటూరులోని లలితా సూపర్ స్పెషలిటీ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అక్కమ్మ పరిస్థితి విషమంగా ఉందని, మరో హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. చివరకూ సమీపంలోని సురక్షా హాస్పిటల్ కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అక్కమ్మ మతి చెందింది. మార్టూరు ఎస్ఐ కోడూరి కమలాకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

నిందితుడికి రెండేళ్ల జైలు

ప్రజాశక్తి-దర్శి

నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్న నిందితుడు నాగులూరి శ్రీనుకు న్యాయమూర్తి ఏడాది జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధించినట్లు ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ సుందరరామయ్య తెలిపారు. ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం...శ్రీను గత ఫిబ్రవరి 22న లీటరు నాటుసారాతో సెబ్ పోలీసులకు తాళ్లూరు మండలం తూర్పుగంగవరం గ్రామంలో పట్టుబడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోర్టుకు హాజరు పరిచారు. స్థానిక జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ 12 నెలలు జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించారు.

పాము కాటు వల్లే..?

- సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బంధువుల ఆందోళన
- తేలు కాటే కారణమంటున్న ఉపాధ్యాయులు


రవికిరణ్ (ఫైల్)

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మండలం రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నాయుడుపల్లి ఎస్‌సి కాలనీకి చెందిన కోట్ల రవికిరణ్ (14) అనే విద్యార్థి తేలు కాటుకు మృతి చెందలేదని, పాము కాటుతోనే మృతి చెందినట్లు బాలుడి తల్లి దండ్రులు కొండమ్మ, కోటేశ్వరరావు ఆరోపించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపా ధ్యాయులు తేలు కాటుతో మృతి చెందారని చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం భోజన విరామం తరువాత 9, 10వ తరగతి విద్యార్థులతో పాఠశాల ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టా రన్నారు. కంప తొలగించే క్రమంలో తమ కుమారుడు పాము కాటుకు గురైనట్లు వారు తెలిపారు. అయితే ఉపాధ్యాయులు వాస్తవాన్ని దాచిపెట్టి స్కూల్ బ్యాగులో తేలు ఉందని, అది కాటేయడంతో ఈ ప్రమాదం జరిగిందని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. మార్కాపురంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాల నుంచి ఒంగోలు రిమ్స్‌కు, అక్కడ నుంచి గుంటూరు జనరల్ హస్పటల్‌కు తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. వైద్యులు కూడా పాము కాటుతో మృతి చెందినట్లు ధృవీకరించారన్నారు. బిడ్డను కోల్పోయిన తమ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు

సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బంధువుల ఆందోళన

విద్యార్థి కోట్ల రవికిరణ్ మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ బంధువులు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. పాము కాటు వేస్తే... కాదు తేలు కాటు అని అబద్ధపు ప్రచారం చేశారన్నారు. సరైన వైద్యం సకాలంలో అందించకుండా జాప్యం జరిగినట్లు ఆరోపించారు. అనంతరం సబ్ కలెక్టర్ ఆఫీసులో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ మాదిగ, ఎంఎస్‌సి నాయకుడు కాశిరావు మాదిగ, లక్ష్మయ్య మాదిగ, ఎస్సీ, ఎస్టీ లీగల్ సెల్ కమిటీ సభ్యులు ఆదిమూలపు లూక తదితరులు పాల్గొన్నారు.

మట్టి మిద్దె కూలి చిన్నారి మృతి

- తల్లికి తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- కంభంరూరల్

మట్టి మిద్దె పైకప్పు కూలి పడిపోయిన ఘటనలో ఏడు నెలల చిన్నారి మృతిచెందింది. తల్లికి పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన మండల పరిధిలోని నర్సిరెడ్డిపల్లిలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం...ఇటీవల కురిసిన వర్షాలకు నరసింహారావుకు చెందిన మట్టి మిద్దె బాగా నానింది. ఈ క్రమంలో నరిసంహారావు భార్య చిన్నారికి పాలు పట్టి ఇంట్లోని ఉయ్యాలో నిద్ర పుచ్చింది. అదే సమయంలో తమ సమీప బంధువు తాగేందుకు నీరు అడగంతో చెంబుతో నీరు తీసుకొని ఆమె బయటకు వచ్చింది. తాగునీరు ఇచ్చి ఇంట్లోకి వస్తున్న క్రమంలో మిద్దె కప్పు ఒక్కసారిగా కుప్పకూలి చిన్నారిపై పడిపోయింది. చిన్నారి భవ్యశ్రీకి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారి తల్లి తృటిలో ప్రమాదం నుంచి బయట పడింది. గాయపడిన చిన్నారిని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది.

కారు,బైకుఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-త్రిపురాంతకం


మృతుడు వెంకట నాగరాజు

కారు, బైకు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాల య్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని గుట్టల ఉమ్మడివరం సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం... భార్యా భర్తలు బత్తుల వెంకటరాజు (38), బత్తుల తిరుపతమ్మ గణపవరం నుంచి బాపట్ల జిల్లా సంతమాగులూరులోని బంధువుల ఇంటికి బైకు వెళ్తున్నారు. అదే సమయంలో పల్నాడు జిల్లా సత్తెనపల్లి నుంచి నంద్యాల వైపు వెళ్తున్న కారు బైకును ఢీకొంది. దీంతో బత్తుల వెంకటరాజుకు నడుం విరిగింది. ఆమె భార్య తిరుపతమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పల్నాడు జిల్లా వినుకొండకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బత్తుల వెంకటరాజు మృతి చెందాడు. తిరుపతమ్మ పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎల్ఐసి ఏజెంట్ల సంఘం ప్రతినిధులు

బీమాపై జిఎస్‌టి రద్దు చేయాలి

ప్రజాశక్తి - అద్దంకి

భీమా రంగంపై జిఎస్‌టి రద్దు చేయాలని కోరుతూ ఈనెల 9న జరుగనున్న ఆందోళనపై స్థానిక ఎల్ఐసి బ్రాంచి వద్ద గోడపత్రిక శుక్రవారం ఆవిష్కరించారు. జోనల్ ఆఫీస్ వద్ద ఈనెల 9న ఎల్ఐసి ఏజెంట్లకు రక్షణ కల్పిస్తూ పార్లమెంట్లో బిల్లు తీసుకురావాలని జరిగే ధర్నాలో ఏజెంట్లు పాల్గొనాలని ఎల్ఐసి ఎఒఐ నెల్లూరు డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి వెంకట్రావు కోరారు. ఎల్ఐసి ఏజెంట్లకు గ్రాడ్యుటి పెంచాలని డిమాండ్ చేశారు. తదితర డిమాండ్లపై చలో జోనల్ ఆఫీస్ ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా అధ్యక్షులు అర్ రామకోటిరెడ్డి, బ్రాంచి నాయకులు బి హనుమంతరావు, షేక్ కాలేబాషా, ఐసిఈయు బ్రాంచి సెక్రటరీ టి సత్యనారాయణ, నాయకులు రవికుమార్, ట్రేడ్ యూనియన్ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ బలరాం

కుందేరు పనులు పరిశీలన

ప్రజశక్తి - చీరాల

చీరాల నుండి వేటపాలెం వరకు ఉన్న కుందేరు బ్రిడ్జిల పనులను ఎంఎల్ఎ కరణం బలరామకృష్ణమూర్తి పర్యవేక్షించారు. కుందెరులో పూడిక తీత, జమ్మూ, గురపు డెక్క తొలగింపు పనులు, అభివృధి పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలు తాగు నీరు, విద్యుత్ సమస్యలు ఆయన దృష్టికి పలువురు తీసుకువచ్చారు. ఆయన వెంట మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, జెసిఎస్ ఇంచార్జీ లేళ్ల శ్రీధర్, మాజీ సర్పంచులు చుండురి వాసు, కట్టా గంగయ్య, దంతం మంతు, డ్రైనేజీ డిఇ దివి సుబ్బారావు, పంచాయితీ రాజ్ డిఇ శేషయ్య, మునిసిపల్ డిఇ ఐసయ్య, డ్రైనేజీ ఎఇఇ జెవై కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ బాబూరావు

ప్రజశక్తి - చీరాల



డాక్టర్ ఐ బాబురావు

వైసిపి డాక్టర్స్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఐ బాబురావు నియమితులయ్యారు. వైసిపి కేంద్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు అందాయి. అంబేద్కర్ ఐడియాలజీ ఫోరం, రోటరీ క్లబ్ అధ్యక్షులుగా ఆయన చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించిన వైసిపి బాధ్యతలు అప్పగించటం హర్షణీయమని పలువురు అభినందించారు. ఈ మేరకు శుక్రవారం వైసిపి ఇన్చార్జ్ కరణం వెంకటేష్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని వైద్య సేవలు అందించారు.

8న 'రోటరీ' వైద్య శిబిరం

ప్రజశక్తి - చీరాల

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 8న ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ ప్రతినిధులు గోడపత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. స్మార్ట్ విజన్ కంటి హాస్పిటల్, చైతన్య కార్డియాలిక్ సెంటర్ సహకారంతో స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్ నందు మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ మావిడాల శ్రీనివాసరావు, సెక్రటరీ చీరాల కృష్ణమూర్తి, ట్రెజరర్ పోలుదాసు రామకృష్ణ, అసిస్టెంట్ గవర్నర్ దోగుపర్తి వెంకట సురేష్, బండారుపల్లి హేమంత్ కుమార్, మువ్వల వెంకటరమణరావు, తులసి, గుర్రం రాఘవరావు పాల్గొన్నారు.

బండారు వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - పర్చూరు



బండారు వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

మంత్రి రోజాపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన టీడీపీ మాజీ మంత్రి బండారు సత్యనారాయణపై వైసీపీ మహిళలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే ఆడవారి చేతిలో అవమానం తప్పదని హెచ్చరించారు. స్థానిక పార్టీ కార్యాలయం నుండి బొమ్మల సెంటర్ వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బండారు సత్యనారాయణ వ్యాఖ్యలను అందరూ ఖండించారు. మీ ఇళ్లలో ఆడవాళ్లు ఉన్నారనేది గుర్తుపెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. ఆడవారిని అవమానించి తప్పుచేశారని అన్నారు. మళ్ళీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఇంటికి వచ్చి బుద్ధి చెప్పాల్సి వస్తుందని అన్నారు. అనంతరం బండారు సత్యనారాయణ మూర్తి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో పర్చూరు సర్పంచ్ మల్లా అంజమ్మ, వైసీపీ మహిళా నాయకురాలు తులసి నాగమణి, ఎం సత్యవతి, నాయకులు అడపా సుధాకరరెడ్డి, మల్లా శ్రీనివాసరావు, ఒగ్గుశెట్టి ప్రసాద్, రామకృష్ణ, ఆకుల హేమంత్, జంగా అనిల్ పాల్గొన్నారు.

ఆక్వా ఫీడ్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన

ప్రజాశక్తి - నిజాంపట్నం



రొయ్యల చెరువుల యాజమాన్య పద్ధతులు వివరిస్తున్న ఎడి

ఆక్వా రైతులు ఫీడ్ మేనేజ్మెంట్ గురించి అవగాహన పెంచుకోవాలని విఎఫ్ఎ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని అముదాలపల్లిలో బెల్లంకొండ శ్రీనివాసరావు రొయ్యల చెరువుల వద్ద మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్య సాగుబడి – 5వ విడత కార్యక్రమంలో భాగంగా ఆక్వా రైతులకు ఫీడ్ మేనేజ్మెంట్ గురించి శుక్రవారం అవగాహన కల్పించారు. పాండ్ చుట్టూ కచ్చితంగా బర్డ్ ఫెన్సింగ్, క్రాబ్ ఫెన్సింగ్ వుండాలని అన్నారు. బయో సెక్యూరిటీ మెయింటైన్ చేయాలని చెప్పారు. నిషేధిత యాంటిబయాటిక్స్ వాడకూడదన్నారు. అప్సడ చట్టం 2020ద్వారా రైతులందరూ ఖచ్చితంగా లైసెన్స్ తీసుకోవాలని అన్నారు. లేదంటే రూ.10 వేలు జరిమానా విధిస్తారని చెప్పారు. డొమెస్టిక్ మార్కెటింగ్ ద్వారా ఫిష్ ఆంధ్రా షాపులకు సబ్సిడీతో అందజేస్తున్నారని తెలిపారు. కెసిసి లోన్ల ద్వారా రైతులకు రూ.50వేలు నుంచి రూ.2లక్షల వరకు ప్రభుత్వం సహాయం అందిస్తుందని అన్నారు.

నిజాంపట్నం : మత్స్యకారులకు ప్రభుత్వం రాయితీపై పరికరాలను అందిస్తున్నట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి పి సాయి సందీప్ తెలిపారు. మత్స్యశాఖ నుండి ప్రాణ రక్షణ పరికరాలైన లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్, జిపిఎస్, ఎకో సౌండర్, విహెచ్ఎఫ్ సెట్లు మత్స్యకారులకు ప్రభుత్వం 75శాతం రాయితీపై ఇస్తుందని తెలిపారు. లబ్ధిదారుని వాటా కేవలం 25శాతం మాత్రమే ఉంటుందని చెప్పారు. కొత్త బోటు, వల, ఇంజను కలిపి యూనిట్‌గా తీసుకుని రూ.5లక్షలు రుణం ఇస్తారని చెప్పారు. మరింత సమాచారం కోసం గ్రామ మత్స్య సహాయకులను సంప్రదించాలని కోరారు.

బస్ షల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి వేటపాలెం



శంకుస్థాపన చేస్తున్న కరణం వెంకటేష్

మండలం లో ని బైపాస్ రోడ్ నాలుగు రోడ్ల కూడలి లో బస్ షల్టర్ నిర్మాణానికి శుక్రవారం చీరాల నియోజవర్గం వైసిపి ఇంచా ర్జి కరణం వెంకటేష్ బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ బైపాస్ కూడలి చుట్టు పక్కల జబర్ కాలనీ, తానా కాలనీ, చల్లారెడ్డిపాలెం, కొణిజేటి చేనేతపురి, కటారివారి పాలెం, పొట్టిసుబ్బయ్య పాలెం, ఒంగోలు వెళ్లుటకు వేటపాలెం పురప్రముఖులు చీరాల–ఒంగోలు బైపాస్ రైడ్ బస్సు ఎక్కాలి అన్న బైపాస్ కూడలి వద్దకు చేరాలిసిందే. బస్సు వచ్చేవరకు ఎండ వాన రోడ్డు ప్రక్కన నిలబడి త్రీవ ఇబ్బందులు గురి అవుతున్న ప్రయాణికుల కోసం బస్సు షల్టర్ నిర్మించాలని..వైస్సార్ రైతు నేస్తం గ్రూప్ సభ్యులు తెలియజేసారు. ఈ సందర్భంగా చీరాల వైస్సార్ ఇంచార్జి కరణం వెంకటేష్ బాబు వైస్సార్ రైతు నేస్తం గ్రూప్ సభ్యులుని అభినందించారు. ఈ కార్యక్రంలో వేటపాలెం మండలం ఇంచార్జి ఎంపిడిఓ ఎంవిఎస్ శర్మ, వెలుగు ఏపీఎం బూదాటి శ్రీనివాసరావు వైస్సార్సీపీ మండల ఆద్యషుడు బొడ్డు సుబ్బారావు, ఆవుల అశోక్ పాల్గొన్నారు.

ఉచితంగా వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - చీరాల



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రావణ్

ఫిజియోథెరఫి, స్పీచ్ థెరఫితో సెరెబాల్ పేలసీతో బాధపడే వారికి ఎంతో ఉపయోగకరమని శ్రీకామాక్షి కేర్ హాస్పిటల్ జనరల్ పిజీషియన్ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. విఠల్‌నగర్ చైతన్య మనోవికాస కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి ఉచిత వైద్యపరీక్షలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి వారి ఆరోగ్యం మెరుగుపడటంలో తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. వరల్డ్ సరెబాల్ పెరాలసిస్ డే సందర్భంగా మనోవికాస కేంద్రం డైరెక్టర్ వెంకన్న బాబు ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ తాడివలస దేవరాజు, ప్రిన్సిపల్ ఎన్ మాధురి, డైరెక్టర్ కిషోర్, శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ సిబ్బంది శ్రీకాంత్, సూర్య పాల్గొన్నారు.

మహిళా చైతన్య దీప్తి 'కనపర్తి'

ప్రజాశక్తి - బాపట్ల

మహిళా జాగృతికి తమ రచనల ద్వారా చైతన్యపరచిన విదుషిమని కనుపర్తి వరలక్ష్మమ్మ అని ఫోరమ్ ఫర్ బెటర్ కార్యదర్శి పిసి సాయిబాబు అన్నారు. వరలక్ష్మమ్మ 127వ జయంతి సందర్భంగా ఫోరం ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూలమాలవేసి శుక్రవారం నివాళులర్పించారు. తెలుగు సాహిత్య చరిత్రలో లేఖా సాహిత్యానికి శ్రీకారం చుట్టిన కవయిత్రి వరలక్ష్మమ్మ అన్నారు. తమ శారద లేఖల ద్వారా స్త్రీలను చైతన్యపరిచారని అన్నారు. మహిళలకు రాజకీయ చైతన్యాన్ని కలిగించారని అన్నారు. స్వాతంత్ర సమరంలో భాగస్వాములుగా చేశారన్నారు. స్త్రీల కోసం బాపట్ల పట్టణం శీలంవారిపాలెంలో స్త్రీ హితైషిణి మండలి స్థాపించారని గుర్తు చేశారు. మహిళల కోసం గ్రంథాలయాన్ని, విద్యాలయాన్ని నిర్వహించని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చేబ్రోలు సతీష్ బాబు పాల్గొన్నారు.

గొట్టిపాటి హాస్పిటల్‌లో ఆర్థో వైద్యసేవలు

ప్రజాశక్తి - అద్దంకి



డాక్టర్ స్వరూప్ చంద్ర

పట్టణంలో వైద్యరంగం క్రమేపీ విస్తరిస్తుంది. ఒంగోలు, గుంటూరు పట్టణాలకు వెళ్లకుండా అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు స్థానికంగా ఉన్న హాస్పిటల్స్ రోగులకు అదనపు సౌకర్యాలు కల్పిస్తున్నారు. పట్టణంలో సీనియర్ వైద్యులుగా గుర్తింపు పొందిన గొట్టిపాటి సత్యనారాయణ హాస్పటల్‌ను మల్టీస్పెషల్టి హాస్పిటల్‌గా అభివృద్ధి చేశారు. డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో విభిన్న సేవలను అందిస్తున్నారు. అందులో భాగంగా హైదరాబాదులోని శ్రావణి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు వైద్యసేవ అందిస్తున్న డాక్టర్ సూదనగుంట స్వరూప్ చంద్ర ద్వారా ప్రతి రెండవ ఆదివారం ఎముకలు, కీళ్లు, నరములు, కీళ్ల మార్పిడి వైద్య చికిత్సకు సంబంధించిన వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీచర్లకు సన్మానం

ప్రజాశక్తి - అద్దంకి

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గత రాత్రి గీతామందిరంలో శింగరకొండ, అద్దంకి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కాలేజీ, హైస్కూలు, ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు 12మందిని ఎంపిక చేసి మాజీ సర్పంచ్ చెన్నుపల్లి వెంకటేశ్వర్లు సౌజన్యంతో సత్కరించారు. ఉపాధ్యాయులు షేక్ మొహమ్మద్ నయీం, కోట అంజమ్మ, కొణిదెన వీర విజయ్ కుమార్, నిడమానూరి ఈశ్వరయ్య, తేలుకుట్ల ప్రసాద్, దేవరకొండ వెంకటేశ్వర్లు, ఎర్రి శ్రీనివాసరావు, ఓరుగంటి శ్రీనివాస రావు, గానుగపాటి ఎలీషా, గోగుల కోటేశ్వర రావు, మామిళ్ళపల్లి ఉమాజ్యోతి, పర్చూరు నాగలక్ష్మిలను సన్మానించారు. ఈసభలో చిన్ని మురళీకృష్ణ అధ్యక్షత వహించగా కమిషనర్ భోగాని శ్రీనివాసులు హాజరయ్యారు. చప్పిడి వీరయ్య, కొల్లా భువనేశ్వరి, అద్దంకి లేవీ ప్రసాద్, జ్యోతి చంద్రమౌళి, సుబ్బారావు, శ్రీనివాసరావు, డాక్టర్ ఉబ్బా దేవపాలన, షేక్ మహమ్మద్ రఫీ, రామకోటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, కోటేశ్వర రావు, పిసిహెచ్ కోటయ్య, చెన్నుపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న తెలుగు తమ్ముళ్లు

టిడిపి ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-కొండపి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు మరలా రావాలని పెదకండ్లగుంట మాజీ సర్పంచ్ తానికొండ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కొండపిలోని టిడిపి కార్యాలయంలో చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా మండల పార్టీ అధ్యక్షులు బి.యలమందనాయుడు అధ్యక్షతన పెదకండ్లగుంట, జాళ్లపాలెం నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాభివృద్ధికి ఎంతో దోహదం చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు పరిశ్రమలు రావాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 2024 ఎన్నికలలో టిడిపి గెలుపు తథ్యమన్నారు. వైసిపి ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా.. చివరికి న్యాయమే గెలుస్తుందన్నారు. కార్యక్రమంలో పెదకండ్లగుంట పార్టీ అద్యక్షులు కె.మల్లిఖార్జునరావు, జాళ్ళపాలెం నాయకులు కోట య్యా, మండల నాయకులు ఖాలేషా, గుండపనేని రామూర్తినాయుడు, ఎన్.సుబ్బరామయ్య, కాశయ్య పాల్గొన్నారు.

బాబుతోనే 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

మండలంలోని తాటాకులపాలెం ఎస్సీకాలనీలో 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' బాబుతో నేను అనే కార్యక్రమం టిడిపి జిల్లా నాయకులు చెన్నారెడ్డి సరసారెడ్డి ఆధర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బ్రహ్మానందం పాల్గొన్నారు.



చిన్నారిని ఆశీర్వదిస్తున్న జడ్పీటీసీ

చిన్నారికి ఆశీర్వాదం

ప్రజాశక్తి-కొండపి

మండలంలోని ముప్పవరం వైఎస్ఆర్‌సిపి నాయకులు కొండ్రగంటి సురేష్ మేనల్లుడు పుట్టిన రోజు వేడుకలకు కొండపి జడ్‌పిటిసి మారెడ్డి వెంకటాద్రిరెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వేముల రమేష్, ముప్పనేని వెంకటరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-కొండపి

మండలంలోని నేతివారిపాలెం గ్రామ ఎస్సీకాలనీకీ పోయే దారిలో సిసి రోడ్డు నిర్మాణం ఎట్టకేలకు ప్రారంభమైంది. వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు నేతివారిపాలెం గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. అశోక్‌బాబు గ్రామంలో పర్యటించినప్పుడు స్థానిక వైసిపి నాయకులు, కాలనీవాసులు ఆయన దృష్టికి ఎస్సీకాలని పోయే దారికి సిసి రోడ్డు కావాలని విన్నవించుకున్నారు. అశోక్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకొని సిసి రోడ్డును మంజూరు చేయించారు. ప్రస్తుతం అక్కడ సిసి రోడ్డు పనులు జరుగుతున్నాయి.

సముద్రంలో సోనా బోట్ల చక్కర్లు

- ఆపలేకపోతున్న అధికారులు - ఆందోళనలో మత్స్యకారులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

సముద్రంలో సోనా బోట్లు చక్కర్లు కొడుతున్నాయి. ఆపాల్సిన అధికారులు చేతులెత్తేయడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం నాడు సోనా బోట్లు శింగరాయకొండ మండలం పాకల ఊళ్ల పాలెం పరిసర ప్రాంతంలో ఉన్న సముద్రతీరానికి దాదాపు 45 బోట్లు వచ్చి సముద్రంలో వేట చేసుకోవడంతో ఈ ప్రాంతంలోనే మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ శాఖాధికారులు ఎన్ని సార్లు హెచ్చరించినా.. తమిళనాడు రాష్ట్రం కడలూరు నుంచి భారీ బోట్లు వచ్చి మత్స్య సంపదను దోచుకుపోతున్నాయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం నాడు కూడా భారీ వలలు వేసి వేట చేస్తున్నారని, ఏ అధికారికి చెప్పినా పట్టించుకోవటం లేదని వాపోతున్నారు.



చక్కర్లు కొడుతున్న సోనా బోట్లు

ఇటీవల కాలంలో కొండపి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు మత్స్యకారులతో సమావేశమై అన్ని శాఖల అధికారులను అక్కడికి పిలిపించి సోనా బోట్లు ఆపే ప్రయత్నం చేయాలని చెప్పారు. స్పీడ్ బోటు కొనాలని నిర్ణయించారు. కోటి రూపాయలు అవుతుందని అధికారులు చెప్పడంతో చందాల ద్వారా అయినా చేయాలని నిర్ణయించి.. జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్‌ని కూడా కలిసి ఇక్కడ మత్స్యకారులు పడుతున్న సమస్యలను వివరించారు. కడలూరు నుంచి సోనా బోట్లపై వచ్చి.. వేట చేసుకొని లక్షలాది రూపాయలు విలువచేసే మత్స్య సంపదను దోచుకుపోతున్నారని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేడు లైట్లు ఆపేసి..టిడిపి నిరసన

ప్రజాశక్తి-కొండపి

'వైసిపి గుడ్డి ప్రభుత్వం కళ్లు తెరిపిద్దాం' అనే కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు అరెస్టుకు నిరసన ఈ నెల ఏడున రాత్రి ఏడు గంటల నుండి 7.05 గంటల వరకు ఇళ్లలో లైట్సు ఆఫ్ చేసి.. నిరసన తెలపాలని కొండపి శాసన సభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దామచర్ల సత్య తెలిపారు. అందరూ ఆ సమయంలో బయటకు వచ్చి దీపాలు, సెల్‌ఫోన్ టార్చ్ లేదా కొవ్వొత్తులు వెలిగిద్దామని చెప్పారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం పిలుపు మేరకు ఈ కార్యక్రమం నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో చేపట్టాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్

సమగ్ర సస్యరక్షణపై శిక్షణ

ప్రజాశక్తి-కొండపి

నాణ్యమైన నారును పొందడానికి మంచి నర్సరీ నిర్వహణ పద్ధతులను అనుసరించాలని ఐటిసి లిమిటెడ్ శాస్త్రవేత్త పి.వెంకటేశ్వర్లు నారు రైతులకు సూచించారు. శుక్రవారం పొగాకు బోర్డు పరిదిలోని పెరిదేపిలో వేలం నిర్వహణాదికారి జి.సునీల్‌కుమార్, పొగాకు బోర్డు అధికారులు ఆద్వర్యంలో నర్సరీ నిర్వహణ, ఎరువుల నిర్వహణ, సమగ్ర సస్యరక్షణ మరియు నీటిపారుదల నిర్వహణపై నర్సరీ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో రైతులకు మరియు నర్సరీ పెంపకందారులకు వివిధ తెగుళ్ల మరియు వ్యాధుల నియంత్రణకు తీసుకోవలసిన నియంత్రణ చర్యలు, నర్సరీలలో కలుపు నిర్వహణ గురించి కూడా అవగాహన కల్పించారు. శిక్షణకు ముందు నర్సరీలను సందర్శించి గుర్తించిన సమస్యలను శిక్షణా కార్యక్రమంలో చర్చించడం జరిగింది. కార్యక్రమంలో ఐటిసి లిమిటెడ్ సిడియం వెంకటరావు, పిఎస్‌ఎస్‌హెచ్ సిడియం ఏ.రామాంజనేయులు, జిపిఐ సిడియం ఉన్నం శ్రీను, సీనియర్ గ్రేడింగ్ అధికారి టి.సాయికుమార్, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా చెరువుల ఆక్రమణ

- సాగు భూములుగా మార్చేస్తున్న వైనం

- పట్టించుకోని జలవనరుల శాఖాధికారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సాగునీటి వనరులను కాపాడాల్సిన అధికారులు మిన్నకుండిపోయారు. వానలు లేక చెరువులు నిండకపోవడంతో ఆక్రమిస్తున్నారు. అదే చెరువు భూములను సాగు భూములుగా మార్చేస్తున్నారు. ఆరుతడి పంటలు, బోర్లు వేసి ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. మరికొంతమంది ఇటుకల వ్యాపారానికి చెరువులనే అడ్డాగా చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా నీటి పారుదల శాఖాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

చెరువులు కనుమరుగు..

యర్రగొండపాలెం నీటిపారుదల శాఖ సబ్‌డివిజన్ పరిధిలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లో 46 సాగు నీటి చెరువులు ఉన్నాయి. ఇవికాక పంచాయితీ రాజ్ పరిధిలోని చెరువులు ఇంకో 50 వరకు ఉన్నాయి. చెరువుల సరిహద్దులు గుర్తించి ఆక్రమణలు జరగకుండా చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో కొలతలు నిర్వహించి సరిహద్దుల చుట్టూ లోతుగా కందకాలు తీశారు. ఇలా ఒక్కో చెరువుకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు ఖర్చు చేశారు. నాలుగేళ్ల తిరిగేసరికి ఈ సరిహద్దులు చెరిపేశారు. మళ్లీ యథాస్థితికి వచ్చింది.

పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు..

చెరువుల అభివృద్ధితో పాటు వాటిని సంరక్షించాల్సిన నీటి పారుదల, రెవెన్యూ, పంచాయతీ శాఖాధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఎప్పటికప్పుడు పరిశీలించి ఆక్రమణలపాలైతే రెవెన్యూ యంత్రాంగం సాయంతో చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఆ శాఖ నుంచి కనీస స్పందన ఉండటం లేదు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో చెరువులు కనుమరుగయ్యే ప్రమాదం లేకపోలేదు.



అమానిగుడిపాడు చెరువు భూమిలో మొక్కలు నాటిన దృశ్యం

ఆక్రమణకు గురైన చెరువులు ఇలా..

– యర్రగొండపాలెం మండలంలోని గురిజేపల్లి, అమానుగుడిపాడు, వాదంపల్లి, మురారిపల్లి, రాయవరం చెరువులు పూర్తిస్థాయిలో నిండే పరిస్థితి లేకపోవడంతో చాలాచోట్ల దీర్ఘకాలికంగా ఉండే ఉద్యానతోటలు సాగు చేస్తున్నారు. యర్రగొండపాలెం కొప్పుకొండ పక్కనున్న జలవనరుల శాఖ పరిధిలోని సాగునీటి చెరువు 350 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ప్రస్తుతం 50 ఎకరాలకు పైగా పంటలు సాగు చేస్తున్నారు. సారవంతమైన భూమి కావడంతో ఏటా ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. చెరువు చుట్టూ తీసిన సరిహద్దు కందకం పూడ్చేశారు. హద్దులు చెరిగిపోయాయి.

– పుల్లలచెరువు మండలంలోని మర్రివేముల, మల్లాపాలెం, పుల్లలచెరువు, చాపలమడుగు, చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా వాటిని ఆక్రమించి బోర్లు వేయించారు. పంటలు సాగు చేసుకుంటున్నారు. కొందరు ఇటుకల బట్టీలకు మట్టి తోలుకుంటూ అక్రమ మార్గంలో సొమ్ము చేసుకుంటున్నారు.

– త్రిపురాంతకం మండలం సోమేపల్లి గ్రామంలోని చెరువు 278 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. సాగర్ ఆయకట్టు పరిధిలో ఉన్న ఈ చెరువులో సుమారు 70 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. చెరువు సరిహద్దులు పూడ్చేశారు. ప్రస్తుతం ఖరీఫ్ పంటలు సాగు చేస్తున్నారు. చెరువు భూముల్లో ఇటుకల వ్యాపారం చేస్తున్నారు. త్రిపురాంతకం అమ్మవారి ఆలయం ఉన్న చెరువు చాలా వరకు ఆక్రమణకు గురైంది. చెరువు చుట్టూ లోతట్టు భూమిని కబ్జాచేసి పంట భూములుగా మార్చారు. కొంతమంది యథేచ్ఛగా ఇటుకల బట్టీలు నిర్వహిస్తున్నారు. ఒడ్డుపాలెం, గణపవరం, దూపాడులోని చెరువులు చాలా వరకు ఆక్రమించారు.

ఆక్రమణదారులపై చర్యలు తప్పవు

జి.మురళీమోహన్, జలవనరుల శాఖ డీఈ, యర్రగొండపాలెం

యర్రగొండపాలెం సబ్‌డివిజన్ పరిధిలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లోని పలు గ్రామాల్లో గల చెరువులు ఆక్రమణకు గురైనట్లు తెలిసింది. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశాల మేరకు ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని చెరువు భూములను స్వాధీనం చేసుకుంటాం..

పేద ప్రజల ఆరోగ్యానికే 'సురక్ష'



మందులు పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ కోన రఘుపతి

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజల చెంతకే వైద్యం తీసుకెళుతుందని ఎంఎల్‌ఎ కోన రఘుపతి అన్నారు. మండలంలోని కంకటపాలెంలో శుక్రవారం జరిగిన వైద్య శిభిరంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి కావాల్సిన చికిత్స కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మందులు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. పెద్ద జబ్బుల చికిత్స కోసం సలహాలు, సిఫారసులు చేసేందుకు అరోగ్య సిబ్బంది ఏర్పాటు ఉన్నట్లు తెలిపారు. అరోగ్య శ్రీ ద్వారా ఎలా వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. పూర్తి సమాచారం ఇక్కడ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి పి హరిబాబు, సర్పంచ్ మద్దిరాల అన్నమ్మ, ఎంపిడిఓ రాధాకృష్ణ, ఈఓపిఅర్‌డి పి శరత్ బాబు, పంచాయతీ కార్యదర్శి షేక్ కరిముల్లా షా ఖాదరి పాల్గొన్నారు.

వేటపాలెం : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు వైసిపి ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు తెలిపారు. మండలంలోని చల్లారెడ్డిపాలెంలో వైద్యశిభిరాన్ని ఆయన ప్రారంభించారు. డబ్బు లేని కారణంగా వైద్యం చేయించుకునే విషయంలో ఇబ్బంది పడకూడదనే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు అందించిన పౌష్టికాహారాన్ని రుచి చూసి ప్రశంసించారు. కార్యక్రమంలో డాక్టర్ బాబురావు, ఇన్చార్జ్ ఎంపిడిఒ ఎంవిఎస్ శర్మ, వెలుగు ఎపిఎం బూదాటి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కె శివలీల, వైసిపి మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, నాయకులు ఆవుల అశోక్, సచివాలయ సెక్రెటరీ కట్ట వినయ్ కుమార్ పాల్గొన్నారు.

కర్లపాలెం : ప్రతి ఒక్కరికి ఇంటివద్దకే వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఆరోగ్య సురక్ష కార్యక్రమం సిఎం వైఎస్ జగన్ చేపట్టినట్లు ఎంఎల్‌ఎ కోన రఘుపతి అన్నారు. మండలంలోని నల్లమోతువారిపాలెంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్యవిభిరంలో ఆయన మాట్లాడారు. ఎంపిటిసి తాండ్ర సాంబశివరావు, తహశీల్దారు కేశవ నారాయణ, సర్పంచ్ మాడా సుబ్రహ్మణ్యం, జడ్పిటిసి పిట్ల వేణుగోపాలరెడ్డి, మండల కన్వీనర్ యాల్లావుల ఏడుకొండలు, ఎఎంసి చైర్మన్ సీతారామిరెడ్డి, ఎంపిటిసి ఆసిఫ్ అలీ పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : జగనన్న సురక్ష వైద్యశిభిరాన్ని మండలంలోని నాగండ్లలో సర్పంచ్ కంచుగంటి పద్మావతి శుక్రవారం ప్రారంభించారు. స్పెషల్ ఆఫీసర్ రమేష్‌బాబు, ఎంపిడిఓ రాజ్యలక్ష్మి, ఇఓఆర్‌డి హాజరై శిబిరం ప్రాముఖ్యత వివరించారు. శిభిరంలో 336మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో డాక్టర్ సిద్ధార్థ, సజన్ విజయన్, ఎమీమా, శివశంకరయ్య వైద్య సేవలు అదించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సోమేపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకటేశ్వరరావు, సిహెచ్‌ఓ కోటేశ్వరరావు, పిహెచ్‌ఎన్ సహస్ర, సూపర్‌వైజర్లు మౌళి, ప్రభావతి, అంగన్‌వాడి సెక్టార్ సూపర్‌వైజర్ కె వాణి పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న వైసిపి ఇన్‌ఛార్జి కృష్ణచైతన్య

పంగులూరు : ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని, అందరూ సంతోషంగా ఉండాలని శాప్ నెట్ చైర్మన్, వైసీపీ ఇన్చార్జ్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు. మండలంలోని కొండమూరులో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో 3500రకాల వ్యాధులకుపైగా కార్పొరేట్ ఆసుపత్రులలో ఉచితంగా వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. డాక్టర్ శివ చెన్నయ్య మాట్లాడుతూ 355మంది రోగులకు పరీక్షించినట్లు చెప్పారు. వారిలో 33మందిని జిల్లా వైద్యశాలకు రిఫర్ చేసినట్లు చెప్పారు. శిభిరంలో డాక్టర్ శ్రీలేఖ, డాక్టర్ వెంకట సత్య రామచంద్ర పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శివపార్వతి, తాహశీల్దారు పద్మావతి, ఎంపిడిఒ రామాంజనేయులు, మండల ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాయని వెంకట సుబ్బారావు, ఎంపిటిసి గుర్రం కళ్యాణి, పంగులూరు సర్పంచ్ గుడిపూడి నాగేంద్రమ్మ రామారావు, నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, సబసాని నందిరెడ్డి పాల్గొన్నారు.

భట్టిప్రోలు : మండలంలోని ఐలవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 550మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ సిహెచ్ రామలక్ష్మి, అరుణరాణి, గైనకాలజిస్ట్ కిన్నెర, రిషికాంత్, ఎ శ్రీనివాసరావు వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని సర్పంచి మాచర్ల కోటేశ్వరరావు ప్రారంభించారు. ఎంపిపి డివి లలితకుమారి, జడ్పిటిసి టి ఉదయభాస్కరి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కర్ర జయశ్రీ, మండల ఉపాధ్యక్షులు కె పిచ్చయ్యశాస్త్రి, ఎంపిటిసి మురుగుడు శీనివాసరావు, తాహశీల్దారు ధూళిపూడి వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ గుమ్మా చంద్రశేఖర్, ఈఓపిఆర్డి ఊహారాణి, కార్యదర్శి జెక్రియ, నాయకులు బాలాజీ, మల్లేశ్వరరావు, గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు, మాచర్ల నాగమల్లేశ్వరరావు, శరత్, తులసి రంగారావు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న వైసిపి ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్

చీరాల : పేదలకు ఇంటి వద్దనే నాణ్యమైన వైద్యం అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని వైసీపీ ఇన్చార్జి కరణం వెంకటేష్ అన్నారు. మండలంలోని తోటవారిపాలెం సచివాలయం1లో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిభిరాన్ని ఆయన పరిశీలించారు. వైద్యశిభిరంలో 371 మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, తహశీల్దారు జివి ప్రభాకరరావు, ఎంపిడిఒ కె నేతాజీ, మెడికల్ ఆఫీసర్ సిహెచ్ శ్రీదేవి, డిప్యూటీ తహశీల్దారు సురేష్, ఆర్బికె చైర్మన్ కావూరి రమణారెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ బోయిన కేశవులు, జెసిఎస్ ఇంచార్జీ బుర్ల సాంబశివరావు, మాజీ వైస్ ఎంపిపి నాదెండ్ల కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి షేక్ ఇమ్రాన్ పాల్గొన్నారు.



కషాయం తయారీని వివరిస్తున్న వ్యవసాయ అధికారులు

కషాయంతో సుడిదోమ నివారణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరులో శ్రీ రాధాకృష్ణ గ్రామ సంఘంలో సభ్యులైన కె రేవతి, రామారావు, ఇస్మాయిల్ కలసి తూటికాడ కషాయం శుక్రవారం తయారు చేశారు. ఎల్1 శివ నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో సుడిదోమ నివారణకు తూటికాడతో తయారు చేసిన కషాయం పిచికారి చేస్తే పూర్తిగా నివారించవచ్చని పేర్కొన్నారు. అలాగే ఆకు ముడత, నాము తెగులు నివారణకు వెల్లుల్లి, పచ్చిమిర్చితో తయారు చేసిన కషాయాన్ని వినియోగిస్తే పూర్తిగా పురుగు నివారణ జరుగుతుందని శివనాగేశ్వరమ్మ తెలిపారు. రసాయన ఎరువుల వాడకంతో వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తక్కువ ఖర్చుతో ప్రకృతిలో లభించే ఇలాంటి ఆకులతో కూడిన కషాయాలు తయారు చేసుకుని వినియోగిస్తే అటు ఖర్చు తక్కువతో పాటు అధిక లాభాలను పొందవచ్చునని సూచించారు. తూటికాడే కదా అని ఇస్మారచ్చ కొండ తగిన మోతాదులో కషాయం తయారు చేసుకుంటే చుడిదోమా పూర్తిగా పోతుందని అన్నారు.

నేటి నుంచి గుంటూరు జట్ల ఎంపిక

ప్రజాశక్తి - బాపట్ల

ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 19 జిల్లా టీమ్ ఎంపిక ఈనెల7 నుండి ఉమ్మడి గుంటూరు జిల్లాలో నిర్దేశించిన ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు క్రీడా విభాగం ఆర్గనైజింగ్ కార్యదర్శి కోటేశ్వరి విలేకరుకు శుక్రవారం తెలిపారు. ఈనెల 7న షటిల్ బ్యాట్మెంటన్ గేమ్ ఎంపిక ప్రో షటిలర్స్ బ్యాడ్మింటన్ అకాడమీ తాడేపల్లి స్టేట్ బ్యాంక్ వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను 9703678786 నెంబరులో తెలుసుకోవచ్చని అన్నారు. 9న జూడో హ్యాండ్ బాల్, నెట్ బాల్ గేమ్స్ ఎంపిక చిలకలూరిపేట ఎఎంజీ కళాశాలలో జరుగుతాయని తెలిపారు. 10న షట్టింగ్ బాల్ గేమ్ క్రీడాకారుల ఎంపిక (సత్తెనపల్లి) గుడిపూడి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జరుగుతుందని తెలిపారు. ఆయా క్రీడల్లో ఎంపికకు పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు, పదో తరగతి మార్కుల జాబితా వెనుకవైపు అడ్మిషన్ నంబర్, సంబంధించిన కళాశాల ప్రిన్సిపాల్ సంతకం, స్టాంప్ ఉండేలా చూసుకొని హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 6300149397 నెంబర్‌లో తెలుసుకోవచ్చని అన్నారు.

వాలీబాల్ జట్టుకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - భట్టిప్రోలు



విద్యార్థిని మాధవి

గుంటూరు జిల్లా వేజెండ్ల జెడ్‌పి ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్ జట్టులో సూర్యపల్లి విపి అండ్ జిఎస్ఎం ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని సిహెచ్ మాధవి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కె శ్రీనివాసశర్మ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నేటి నుండి కడపలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో అండర్ 17విభాగంలో గుంటూరు జిల్లా జట్టులో మాధవి ఆడ నున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినితో పాటు పిఈటి జివిఎస్ నాగేశ్వరరావును అభినందించారు.

21న స్పెషల్ లోక్ అదాలత్

ప్రజాశక్తి - అద్దంకి

ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశానుసారం పట్టణంలోని కోర్టు సముదాయ ఆవరణలో ఈనెల 21న 3వ శనివారం స్పెషల్ లోక్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందని చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి బి బాబునాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ స్పెషల్ లోక్ అదాలత్‌లో రెవిన్యూ కేసులు, మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ పరిష్కరించనున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎరుకల హక్కుల సాధనకు పోరాడాలి

ప్రజాశక్తి - బాపట్ల

ఎరుకల హక్కుల సాధనకు ఐకమత్యంతో పోరాడాలని రాష్ట్ర ఎరుకల ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షులు దేవరకొండ శంకరరావు అన్నారు. స్థానిక సంజీవ్ గాంధీ కాలనీలో శుక్రవారం నిర్వహించిన ఎరుకల ప్రజా సంక్షేమ సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరుకల జాతి అభివృద్ధి, హక్కుల సాధనకు ఐకమత్యంతో ఎరుకల తెగ సమాజానికి అవసరమైన సేవలు అందించేందుకు పాటుపడాలన్నారు. ఎరుకల తెగ మూలపురుషుడైన ఏకలవ్యుని విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికితెస్తే పరిష్కారానికి సహకరిస్తామని అన్నారు. బాపట్ల జిల్లా అధ్యక్షులు పేరం సాంబశివరావు, గౌరవాధ్యక్షులు పల్లపు బిక్షాలు, ప్రధాన కార్యదర్శి దేవరకొండ పవన్ కుమార్, కోశాధికారి ఇట్ట శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇట్ట ధన కోటేశ్వరరావు, కార్యదర్శి బండి కాళీ కృష్ణ, ఉపాధ్యక్షులు పేరం సుబ్బారావు, గౌరవ సలహాదారు, పేరం వెంకటేశ్వర్లు, మహిళా అధ్యక్షురాలు దేవరకొండ నాగరాజి ఎన్నికయ్యాఆరు. సమావేశంలో కట్టా రామాంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవరకొండ రాము పాల్గొన్నారు.



ఎరుకల ప్రజా సంక్షేమ సంఘం నూతన కమిటి సభ్యులు

ఫైరింగ్‌లో సెయింట్ విద్యార్థి ప్రతిభ

ప్రజశక్తి - చీరాల

ఫైరింగ్‌లో జాతీయస్థాయిలో 3వ స్థానం గెలుచుకున్న సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థి పగడాల ఈశ్వర్ రంగరాజ్‌ను స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. అఖిలభారత సైనిక్ దళ్ జూనియర్ డివిజన్‌కు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ తరపున నిర్వహించిన ఫైరింగ్‌కు స్థానిక సెయింట్ ఆన్స్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న పగడాల ఈశ్వర్ రంగరాజ్ ఎంపికయ్యారు. సెప్టెంబర్ 28న ఢిల్లీలో నిర్వహించిన ఫైరింగ్‌లో జాతీయ స్థాయిలో 3వ స్థానంలో నిలిచారు. ఢిల్లీలో మేజర్ జనరల్ పిఎస్ స్నేహ రావత్ సేన చేతుల మీదుగా మెడల్ అందుకున్నారు.



షఉటింగ్‌లో జాతీయ స్థాయి 3వ స్థానం విద్యార్థికి అభినందనలు

పంటలపై అవగాహన

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

సాగు నీటి కొరత దృష్ట్యా అధికారులు ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని రైతు సంఘం జిల్లా నాయకులు కందిమళ్ళ రామకోటేశ్వర రావు కోరారు. సాగు నీటి కొరత కారణంగా వరి పంట వేసుకోవద్దని ప్రభుత్వం ప్రకటించటంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై రైతులు ఆలోచిస్తున్నారని అన్నారు. కావున వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

పావులూరులో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్



వెంకాయమ్మ (65)

మండలంలోని పావులూరులో 523వ నేత్రదానం శుక్రవారం చేశారు. గ్రామానికి చెందిన పావులూరి వెంకాయమ్మ (65) మృతి చెందటంతో కుటుంబ సభ్యుల సమాచారంతో గుంటూరు శంకర్ కంటి ఆసుప్రతి వైద్యులు కార్నియాలను సేకరించారు. కుటుంబ సభ్యులు వెంకటేశ్వర్లు, నాగభూషణంను మాజీ సర్పంచ్ పులఖండం బద్రిరెడ్డి, సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి స్వామి, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కరి కమలేశ్వరరావు, జెట్టి వెంకటేశ్వర్లు అభినందించారు.

వినూత్నంగా టిడిపి నిరసన దీక్షలు



బాపట్ల టిడిపి దీక్షల్లో టిడిపి ఇన్‌ఛార్జి నరేంద్రవర్మ



రేపల్లెలో టిడిపి నిరసన దీక్షలో ప్లేకార్డులతో నేతలు



పెదపులిపర్రు దీక్షల్లో మాజీ మంత్రి నక్క ఆనందబాబు

ప్రజాశక్తి - అద్దంకి

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా వినూత్న రీతిలో నిరసనలు కొనసాగుతున్నాయి. రిలే నిరాహార దీక్షలు అద్దంకిలో శుక్రవారం నాటికి 24 రోజుకు చేసుకున్నాయి. ప్రతి రోజు 100కుపైగా కార్యకర్తలు దీక్షల్లో ఉంటున్నారు. గాంధీ జయంతి రోజు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఒకరోజు దీక్షలో పాల్గొని కార్యకర్తలకు ఉత్సాహం నింపారు. నిరసన కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లేందుకు కార్యాచరణ చేపట్టారు. అందులో భాగంగా సైకిల్ ర్యాలీని చేస్తూ ద్వితీయ శ్రేణి నాయకులను, కార్యకర్తలను భాగస్వామ్యం చేస్తున్నారు. ఈ పాటికే సంతమాగులూరు, కొరిశపాడు, అద్దంకి మండలాల్లో 10కిలోమీటర్ల చొప్పున మూడు, నాలుగు గ్రామాలను చుట్టి వచ్చేలా నిరసన ర్యాలీలు చేశారు. జులైలో ఆగిన లోకేష్ యువగళం పాదయాత్ర నుండి నేడు చంద్రబాబు అరెస్టు నిరసనగా జరుగుతున్న సైకిల్ ర్యాలీల వరకు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల్లో జోష్ పెంచాయని పలువురు రాజకీయ పరిశీలకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రేపల్లె : చంద్రబాబు విడుదల కావాలని దీక్షలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు అనగాని శివ ప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు రాజకీయ కుట్రలో భాగమని అన్నారు. అక్రమ అరెస్టుకు నిరసనగా చేపట్టిన రిలే దీక్షలు 23వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో నిజాంపట్నం మండలం అడవులదీవి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కూర్చున్నారు. త్వరలో నిర్దోషిగా బయటకు వస్తారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, వై ధర్మతేజ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : మండలంలోని పెదపులివర్రులో చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా శుక్రవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలో మాజీ మంత్రి నక్క ఆనందబాబు మాట్లాడారు. రాష్ట్రంలో సైకో పాలన జరుగుతుందని అన్నారు. ఎలాంటి అక్రమాలు లేడానే అక్రమాలు జరిగినట్లుగా చూపి చంద్రబాబుని అరెస్టు చేసి జైలుకు పంపించారని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓటమి భయంతో ప్రతిపక్షాలను అణిచివేయాలని అక్రమ కేసుల్లో అరెస్టులు చేయిస్తున్నట్లు చెప్పారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా రానున్న ఎన్నికల్లో ప్రజలు టిడిపిని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె మాజీ శాసనసభ్యులు ముమ్మనేని వెంకటసుబ్బయ్య, టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, టిడిపి మండల కన్వీనర్ వాకా శేషుబాబు, నాయకులు దినకర బాబు, ఎడ్ల జయశీలరావు, కనపర్తి సుందర్రావు, సిరాజుద్దీన్, కుక్కల వెంకటేశ్వరరావు, వేములపల్లి జగన్నాధరావు, మైనేని మురళీకృష్ణ, కనగాల మధుసూధన ప్రసాద్ ఉన్నారు.

బాపట్ల : చంద్రబాబుపై తప్పుడు ఆరోపణలతో కేసులు బనాయించి అక్రమంగా అరెస్టు చేశారని టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టీఎస్ఎన్ఎఫ్, తెలుగు మహిళా విభాగం నాయకులు రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో ముప్పా శరత్ చంద్ర, బాల కోటేశ్వరరావు, ఉడతా దేవేంద్ర బాలాజీ, పల్లం జీవన్, చెన్నుపాటి హైమావతి, పల్లం సరోజిని, రాణి, రజనీ, ఝాన్సీ పాల్గొన్నారు.

కారంచేడు : రాష్ట్రంలో ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయించి ఆనందిస్తున్న వైసిపి చీకటి పాలనకు చరమగీతం పాడాలని ఎఎంసి మాజీ ఛైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును, రిమాండ్‌ను వ్యతిరేకిస్తూ స్థానిక టిడిపి కార్యాల యంలో 28వ రోజు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు కంభం పాటి నరేంద్ర, మహిళా నాయకులు పాతూరి ఆదిలక్ష్మి, పోతిని వెంకటేశ్వర్లు, బొయిన శ్రీను, అనిల్, గొట్టిపాటి శ్రీనివాసరావు, విరవల్లి పార్వతి, ఆకుల లక్ష్మి, సరసు సుధారాణి, జాన్సి, కొల్ల బస్కర్, సుబ్బయ్య, దగ్గుపాటి లక్ష్మి, నాగమణి, బొడవుల గన్, శివ, పాతూరి శివరాం, సాయి, చిన్నమ్మ, సుజాత, వెంకట నరసమ్మ, హైమా పాల్గొన్నారు.

చీరాల : చంద్రబాబుపై అక్రమ కేసులతో అరెస్టు చేశారని టిడిపి ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం రిలే నిరాహార దీక్షలు చేశారు. దీక్షలో యర్రా శివనాగ మల్లేశ్వరి, పడవల లలిత, అవ్వారు శివకుమారి, పొట్టేటి రాజేశ్వరి, కౌతరపు నాగేశ్వరి, షేక్ ఆదంబీ, గుద్దంటి శివలీల, షేక్ ఆషా, గుత్తికొండ హారిక, షేక్ షకీదా, గుద్దంటి శ్రీలక్ష్మి కూర్చున్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాస రావు, దగ్గుబాటి వెంకట్రావు, తిరుపతి రాయుడు, తోట సాంబశివ రావు, కౌతరపు జనార్ధన్ రావు, గరికనచిన్న, పల్లగొర్ల బాలసుబ్రమణ్యం, షేక్ బాజీ, షేక్ కరిముల్లా, శింగిరేసు కాళిదాసు, దీపాల శివప్రసాద్, పులిమి శివ పాల్గొన్నారు.

టిడిపి బిసి సెల్ చీరాల ఇన్‌ఛార్జిగా డోలా

ప్రజాశక్తి - భట్టిప్రోలు

చీరాల నియోజకవర్గ టిడిపి బీసీ సెల్ ఇన్చార్జిగా ఐలవరం గ్రామానికి చెంది న బీసీ సెల్ రాష్ట్ర కమిటీ సభ్యులు డోలా శివకుమార్ నిమిత్తం అయ్యారు. బీసీ సెల్ అధ్యక్షులు దీపాల ప్రసాద్‌తో కలిసి ఆయన శుక్రవారం కొండయ్యను కలిశారు.



కొండయ్యతో డోలా శివకుమార్

గొట్టిపాటి సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - అద్దంకి

చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ భారీ సైకిల్ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. మండలంలోని నాగులపాడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం ప్రారంభమై సైకిల్ యాత్ర కొంగపాడు మీదుగా మణికేశ్వరం ఎస్సి కాలనీలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి శివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. 10కిలోమీటర్ల పొడవున సాగిన సైకిల్ యాత్రలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సైకిల్ తొక్కారు. చంద్రబాబును స్కిల్ డెవలప్మెంట్ కేసుతో సంబంధం లేకపోయినా అక్రమంగా నిర్బంధించిందని అన్నారు. దీనికి రాబోయే రోజుల్లో వైసిపి తగిన మూల్యం చెల్లించుకోవాల్సింది వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుండ్లకమ్మ జలాశయ ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయి 20నెలలైనా అమర్చకపోవడం వైసిపి పనితీరుకు నిదర్శనం అన్నారు. టిడిపి సందర్భన తర్వాత జలవనరుల శాఖ మంత్రి నెల రోజులలోపే గేట్లు ఏర్పాటు చేస్తామని గొప్పలు చెప్పారని అన్నారు. గేట్లు పెట్టకపోవడం వెనుక కుట్ర కోణం ఉందని అన్నారు. ఇసుక మాఫియా కోసమే గేట్లు పెట్టలేదని ఆరోపించారు.



సైకిల్ ర్యాలీలో ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్



ఎంఒయు చూపుతున్న వనమ రామకృష్ణరావు

కేర్ మెడికల్ కాలేజీతో ఒప్పందం

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాల పిట్టలవానిపాలెం కెర్ యోగా నేచురోపతిక్ మెడికల్ కళాశాల యాజమాన్యంతో అవగాహనా ఒప్పందం చేసుకున్నట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సంయుక్తంగా శుక్రవారం తెలిపారు. తమ కళాశాల విద్యార్థులకు యోగా, మానసిక ఒత్తిడి నియంత్రణ (స్ట్రెస్ మేనేజ్మెంట్), జీవన విధాన నిర్వహణపై శిక్షణ ఇచ్చుటకు అవగాహనా ఒప్పందం కుదిరినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాలరావు చెప్పారు. ఈ అవగాహన ఒప్పందం క్రింద విద్యార్థులకు మానసిక ఒత్తిడిని ఎదుర్కొనుటకు అవసరమైన యోగా శిక్షణ, మానసిక ఆరోగ్యం పెంపొదించుటకు అవసరమైన సూచనలు, సలహాలు కేర్ యోగా నేచురోపతిక్ మెడికల్ కాలేజి వారు అందజేస్తారని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన యోగా శిక్షణపై ప్రణాళికను రూపొందించి యోగ శిక్షణ ఇవ్వనున్నట్లు కెర్ యోగా నేచురోపతిక్ మెడికల్ కాలేజి ప్రెసిడెంట్ వి రాధాకృష్ణ, కరస్పాండెంట్ వి కిషోర్ కుమార్, ప్రిన్సిపాల్ ఎన్ జయలక్ష్మి, అడ్మిన్ ఇన్చార్జి పి నాగేశ్వరరావు తెలిపారు. ఈ శిక్షణలో యోగాసనాలు, వివిధ బ్రీతింగ్ ఎక్సర్సైజెస్, రిలాక్సేషన్ పద్ధతులు, మానసిక ఒత్తిడి నియంత్రణకు కావలసిన పద్దులను విద్యార్థులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ మేరకు ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు.

నేడే ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని రామకూరులో ఈనెల 7న శనివారం విజయవాడ హెల్ప్ హాస్పటల్ వారిచే ఉచిత గుండె వైద్య శిబిరం జరుగుతుందని రామకూరు మాజీ సర్పంచ్ టి చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరంలో ఆయాసం, గుండె దడ, గుండె నొప్పి, గుండె బరువుగా ఉండటం, తల తిరగటం, ఎడమ చేయి లాగటం, ఎక్కువ కాలంగా బిపి, షుగర్ ఉన్నవారికి ఎంతో ఖరీదైన గుండె స్కానింగ్ పరీక్షలు ఈసీజీ, ఈసిహెచ్ఓ (ఏకో) స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు. అవసరమైన వారికి ఉచితంగా యాంజియోగ్రాం పరీక్ష చేస్తారని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి ఇన్‌ఛార్జి కొండయ్య

పందిళ్ళపల్లిలో కొండయ్య ప్రచారం

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని పందిళ్లపల్లిలో శుక్రవారం అంబేద్కర్ యువజన స్పోర్ట్స్ యూత్ చంద్రబాబుకు మద్దతుగా కరపత్రాలు పంపిణీ చేశారు. చంద్రబాబుతోనే ఉపాధి రంగాలు మెరుగవుతాయని పేర్కొన్నారు. చంద్రబాబుకు రిమాండ్ విధించడం బాధాకరమని అన్నారు. వైసిపి అరాచక ప్రభుత్వాన్ని పారదోలాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాసిక వీరభద్రయ్య, టిడిపి గ్రామ అధ్యక్షులు పేరిశెట్ల బాలచంద్ర, మండల అధ్యక్షులు బొగ్గుల పార్ధసారథి, కౌతరపు జనార్ధనరావు, పొగడదండ వెంకటేశ్వర్లు, షేక్ లాల్ అహ్మద్, ఆవుల రామారావు, ఊస శ్రీనివాసరావు, జంగిలి ఏడుకొండలు, ఉసురుపాటి సురేష్, కందిబోయిన వెంకటేశ్వర్లు, గరికన చిన్న, దగ్గుబాటి వెంకట్రావు, నరాల తిరుపతి రాయుడు పాల్గొన్నారు.

చిరు పొట్ట దశలో పైరుకు సస్యరక్షణ తప్పనిసరి

ఎఒ చంద్రశేఖర్

ప్రజాశక్తి - బాపట్ల రూరల్



ఎఒ ఆర్ చంద్రశేఖర్

మండలంలో సాగులో ఉన్న వరి పంట చిరు పొట్ట దశలో ఉందని వ్యవసాయ శాఖ అధికారి ఆర్ చంధ్రశేఖర్ తెలిపారు. కావున సస్య రక్షణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. 82నుంచి 85రోజుల పైరు చిరు పొట్ట దశలో ఉందన్నారు. మండలంలో ఈపాటికే 8,837.5 హెక్టార్లలో వరి సాగు ఉందన్నారు. ఈ దశలో ఉన్న పైరు గింజ బరువు, నాణ్యత ఎదుగుదలకు పొటాష్ ఎరువును ఎకరాకు 10నుంచి 15కేజీలు చల్లాలని అన్నారు. వాతావరణానికి అక్కడక్కడ బెట్ట పరిస్థితులు ఏర్పడితే నివారణ కోసం యూరియా 5నుంచి 10కేజీలు, 5కేజీల పొటాషియం కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. వెద పెట్టిన పైరులో కలుపు కనిపిస్తే మనుషులను పెట్టి కలుపు తీసేయాలని చెప్పారు.



వరిపైరు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

మచ్చ తెగులు ఆశిస్తే కార్బండిజం లేదా సూడో మోనాస్ పిచికారి చేసుకోవాలన్నారు. నత్రజని ఎరువులు అధికంగా వాడ వద్దని చెప్పారు. అలా వాడితే తెగుళ్ళ, పురుగులు ఎక్కువగా అశీ స్తాయని అన్నారు. పైరులో జింక్ లోపం ఉంటే పైరు ఆకులు పసుపు రంగులో మారి ఎండిపోతాయని తెలిపారు. అలా ఉంటే రెండు గ్రాముల జింక్ సల్ఫేట్, ఐదు గ్రాముల యూరియా ఒక లీటర్ నీటిలో కలిపి ఐదు రోజులకు ఒకసారి రోజుకు రెండు లేదా మూడుసార్లు పిచికారి చేసుకోవాలన్నారు. ఐరన్ లోపం ఉంటే పైరు తెల్లగా మారుతుందని తెలిపారు. అక్కడక్కడ తుప్పు పట్టినట్టుగా మచ్చలు ఇటుక రంగులో కనిపిస్తాయని తెలిపారు. మొక్క పెరగదని తెలిపారు. దీని నివారణకు ఒక లీటర్ నీటిలో అన్నబేది 20గ్రాములు, ఒక గ్రాము నిమ్మ ఉప్పు, లేదా ఒక నిమ్మ చెక్క కలిపి పిచికారి చేసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం పైరు చిరు పొట్ట దశలో ఉన్నందున ఎలుకల బెడద మొదలవుతుందని అన్నారు. ఎలుకల కన్నాలు గుర్తించి వాటిని మూసేయాలని తెలిపారు. రెండో రోజు వెళ్లి మూసేసిన కన్నాలు తెరుచుకొని ఉన్న ఎలుకల బొరియలను గుర్తించి అక్కడ మందు పెట్టాలన్నారు. విషపు ఎరను కలుపుకోవాలని, సామూహికంగా ఎలుకల నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఒక ఎకరాకు 450గ్రాముల నూకలు, 20గ్రాముల శనగ నూనె, 20 గ్రాముల బ్రోమో డయోలిన్ మందు కలుపుకొని ఆ మిశ్రమాన్ని ఎలుక కన్నాల వద్ద పెట్టాలన్నారు. సస్యరక్షణ పద్ధతులను అమలు చేస్తూ, జాగ్రత్తలు తీసుకొని పంట రక్షించుకొని అధిక దిగుబడులు పొందాలని సూచించారు.

అందరూ కలసికట్టుగా పనిచేద్దాం

- అభ్యర్థుల విషయంలో ముఖ్యమంత్రి నిర్ణయానికి కట్టుబడాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

చిన్నపాటి అభిప్రాయ భేదాలను విడనాడి అందరం కలసికట్టుగా పని చేసి రాబోయే ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసి.. మళ్లీ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేద్దామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఒంగోలులో 'ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి' కార్యక్రమం జరిగింది. పార్టీ అధ్యక్షులు జంకే వెంకట రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. కార్యకర్తలకు ప్రతి నాయకుడూ అండగా ఉండాలని సూచించారు. ఎవరికీ ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానన్నారు. పార్టీ నిర్ణయాలకు అందరూ కట్టుబడి ఉండాలన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ చేపట్టిన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి నిర్ణయించిన అభ్యర్థిని గెలిపించాలని కోరారు. అభ్యర్థుల ఎంపిక విషయంలో ముఖ్యమంత్రి నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యేలు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

రెవెన్యూ సమస్యలు త్వరలో పరిష్కరిస్తాం..

కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి- కారంచేడు

జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం శుక్రవారం నాడు కారంచేడు రామానాయుడు కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాషా, జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్ లుపాల్గొన్నారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రంజిత్ భాష మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో మొత్తం 196 అర్జీలు వచ్చాయని, వీటిలో 19 రెవెన్యూ కేసులు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమం ప్రారంభం నుండి అర్జీదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ తమ సమస్యలపై కలెక్టర్కు అర్జీలు ఇవ్వడంతో సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి ఆ సమస్యలను విచారించి పరిష్కారం చేయాలని సూచించారు. అలాగే రెవెన్యూ కేసులకు సంబంధించి వాటిని కూడా త్వరలో విచారించి తగిన పరిష్కారం చేస్తామని కలెక్టర్ చెప్పారు. అర్జీలు ఆయా శాఖలకు సంబంధించిన అధికారులకు ఇచ్చి వాటిని సత్వరమే విచారించి పరిష్కారం చేయమని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం జిల్లాలోని ఒక్కొక్క మండలంలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరుగుతుందని వచ్చే శుక్రవారం వేమూరులో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు, కారంచేడు మండల స్థాయి అధికారులు అన్ని పంచాయతీల కార్యదర్శులు మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ రంజిత్‌బాషా

వివోఏల ధర్నాను జయప్రదం చేయండి

వివోఏల జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచాల లక్ష్మి

ప్రజాశక్తి-బాపట్ల

వెలుగు క్రాంతి పథకం శాఖలో పనిచేస్తున్న వీవోఏల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 10, 11 తేదీల్లో జరిగే వివోఏల ధర్నాను జయప్రదం చేయాలని వివోఏల జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచాల లక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన ధర్నా సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో డ్వాక్రా మహిళలకు విస్తత సేవలు అందిస్తున్న యానిమేటర్ల(వివోఏ)ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలన కాలంలో తీసుకొచ్చిన కాలపరిమితి జీవోను వెంటనే రద్దు చేయాలన్నారు. వివోఏలకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రమైన బాపట్లలో 36 గంటల పాటు ధర్నా జరుగుతోందన్నారు. జిల్లాలో అన్ని మండలాల నుండి వివోఏలు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలన్నారు. 11న కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాకు వివోఏల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధనలక్ష్మి హాజరవుతారన్నారు. సమావేశంలో వివోఎల కోశాధికారి జె.జ్యోతి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.మజుందార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుంచాల లక్ష్మి



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్

379 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలో సచివాలయాల పరిదిలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును గ్రామాలలో ఉండే ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ పి.సింగరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఇలవర సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 379 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి.. మందులు అందజేశారు. వీరిలో ఆసుపత్రికి 17 మంది రిఫర్ చేయడం జరిగిందన్నారు. 73 మందికి కంటి పరీక్షలు, ఇసిజి 32 మందికి తీసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేపూరి ప్రసన్న, డిఎల్‌పివో ఉషారాణి, యంపిడివో రమణమూర్తి, పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ అనుష, కామేపల్లి వైద్యాదికారి జి.రేష్మి, డాక్టర్ లీనా, స్పెషలిస్టు డాక్టర్లు డాక్టర్ ప్రసన్న, డాక్టర్ దివ్యశ్రీ పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

కొనసాగుతున్న సామూహిక దీక్షలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ స్థానిక టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో సామూహిక రిలే నిరాహారదీక్షలు కొనసాగుతున్నాయి. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల 24వ రోజు శుక్రవారం కాకతీయ సేవా సమాఖ్య నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఎన్ని అడ్డంకులు, కుట్రలు చేసినా చంద్రబాబు నాయుడుని ఏమీ చేయ లేరని, 2024 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయ ఢంకా మోగిస్తుందని పలువురు నేతలు తెలిపారు. దీక్షలలో కాకతీయ సేవా సమాఖ్య సభ్యులు బెజవాడ వెంకట్రావు, మాలెంపాటి కష్ణారావు, మండవ శేషగిరిరావు, కొఠారి నాగేశ్వరావు, కామేపల్లి శ్రీనివాసరావు, నల్లూరి రవి, బండారు మదన్, టి.అనంతమ్మ,ఆర్ల వెంకట రత్నం,ఉప్పలపాటి నాగేంద్రమ్మ, తెలుగునాడు అంగన్‌వాడీ, డ్వాక్రా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెద్దిశెట్టి వరలక్ష్మి, షేక్ అజిమున్నీసా, ఒంగోలు నియోజకవర్గ అధ్యక్షులు నిడమానూరి పావని టిడిపి ఒంగోలు నగర నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



క్రీడల్లో పాల్గొన్న బాలికల జట్టు

క్రీడలతో ఆరోగ్యం: ఆర్ఐఓ

ప్రజాశక్తి-శింగరాయకొండ

క్రీడల ద్వారా విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని ప్రకాశం జిల్లా ఆర్ఐఓ ఎ.విక్టర్‌సైమన్ తెలిపారు. శింగరాయకొండ అయితారామయ్య శ్రేష్టి మరియు గడ్డం వీర రాఘవయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రకాశం జిల్లా అండర్ 19 స్కూల్ గేమ్స్ వాలీబాల్ టెన్నికాయిట్ షటిల్ బ్యాట్మింటన్ బాలబాలికల క్రీడా జట్టు ఎంపిక జరిగింది. ముఖ్యఅతిథిగా ఆర్ఐఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ గెలుపు, ఓటములను సహజంగా తీసుకోవాలన్నారు. ఆటల ద్వారా స్నేహాలు బలపడతాయని వివరించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డాక్టర్ బి హరిబాబు, టంగుటూరు కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు, కళాశాల పీడీ కె.శంకర్రావు పాల్గొన్నారు.



ఆటల్లో బాలుర జట్టు

మడనూరులో పారిశుధ్యంపై అవగాహన

ప్రజాశక్తి-కొత్తపట్నం

మండలంలోని మడనూరులో గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమం సందర్భంగా ఎంపీడీవో పి. సుజాత గ్రామంలో పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. నీటి నిల్వలు, చెత్తకుప్పల వద్దకు వెళ్లి నీటితొట్లలో ఉన్న నిల్వలను శుభ్రతను పరిశీలించారు. కొబ్బరి బొండాలు, తొట్లు, ప్లాస్టిక్ డ్రమ్ములు తదితర వంటి వాటిలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో డెంగ్యూ దోమ ఉద్భవిస్తుందని తెలియజేశారు. ఇలాంటివి లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ బాలచెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి



జై భీమ్ భారత్ పార్టీ కోసం రేపల్లె నియోజకవర్గంలోని బహుజనుల కోసం, ఎంతో కష్టపడి పనిచేసే బాపట్ల పార్లమెంటరీ అభ్యర్థి శ్రీ పెనుమాల సుబ్బారావు గారు అకాల మరణం చెందడం బాధాకరం. జై భీమ్ భారత్ పార్టీ తరపున వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం....

శ్రీ పెనుమాల సుబ్బారావు గారు
మరణం:-26-09-2023

జడ శ్రావణ్ కుమార్ మాజీ న్యాయమూర్తి
జైభీం భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు...

దోవా రమేష్ రాంజీ (అడ్వకేట్)
బాపట్ల జిల్లా అధ్యక్షులు

కర్రా బాబురావు
రేపల్లె మండల కన్వీనర్

పోతార్లంక శివ వెంకటేశ్వర రావు

నెరుసు వెంకటరావు నాయుడు

మండే యాకోబు

పెద్దకర్మ: ది. 08-10-2023 (ఆదివారం)న రేపల్లె 13వ (ఉప్పూడి రోడ్) వార్డులోని సుబ్బారావు గారి స్వగృహమునందు జరుగును. సెల్ : 8333837743, 9885367743